

జోన్-2లో రూ.553 కోట్లతో యూజీడీ

- జీవీఎంసీకి రుణం మంజూరుచేసిన ఐఎఫ్‌సీ
- సీఎం సమక్షంలో జీవీఎంసీ, ఐఎఫ్‌సీ ఒప్పందం



జీవీఎంసీ జోన్-2 (మధురవాడ) పరిధిలో రూ.553 కోట్ల వ్యయంతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం అవసరమైన నిధులను ప్రపంచబ్యాంకుకు అనుబంధంగా పనిచేసే అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) రుణంగా సమకూర్చేందుకు అంగీకరించింది. - వివరాలు మెయిన్ 11లో

సహనాన్ని పరీక్షించొద్దు

- అర్జీల పరిష్కారం విషయంలో అధికారులు పద్ధతి మార్చుకోవాలి
- లేనిపక్షంలో చర్యలు తప్పవు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆగ్రహం
- జీవీఎంసీ, పోలీస్ శాఖలకు వస్తున్న ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం లభించడం లేదని అసంతృప్తి
- టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వీడకుంటే సస్పెండ్ చేస్తానని హెచ్చరిక

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పట్ల స్పందించే తీరులో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ హెచ్చరించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో తొలుత గత వారం వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యల గురించి సమీక్షించారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం లేకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయా సమస్యలపై ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఇచ్చే అర్జీలకు పరిష్కారం చూపకుండా సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ ఇవ్వడమేమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలన్నారు. జీవీఎంసీ, పోలీస్ శాఖలపై వస్తున్న ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం లభించడం లేదని నివేదికలు చూస్తే అర్థమవుతుందన్నారు. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది అర్జీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. గతంలో అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ప్రజల పట్ల అధికారులు, సిబ్బంది వ్యవహరించే తీరు మెరుగుపడాలని సూచించారు. అందిన ఫిర్యాదును పరిష్కరించే క్రమంలో అర్జీదారుడితో సంబంధిత అధికారులు ఫోన్‌లో మాట్లాడాలని, సమస్యను సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని హితవు పలికారు. తన సహనాన్ని పరీక్షించవద్దని అంటూ కలెక్టర్ గట్టిగా హెచ్చరించారు. కాగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 315 ఫిర్యాదులు అందాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 119, జీవీఎంసీ..85, పోలీస్ శాఖకు సంబంధించి 21 ఉండగా, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి. అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జేసీ కెమయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



శివారున జోరు వాన

- పెందుర్తి నుంచి గోపాలపట్నం మధ్య భారీ వర్షం
- పెందుర్తి జోనల్ కార్యాలయం వద్ద 81 మి.మీ.లు

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం నగరంలో పలుచోట్ల భారీవర్షం కురిసింది. ముఖ్యంగా పెందుర్తి నుంచి గోపాలపట్నం మధ్య రెండు గంటలపాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. గెడ్డలు, వాగులు పొంగాయి. పెందుర్తి జోనల్ కార్యాలయంలో 81 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. నగరంతోపాటు గాజువాక, పెదగంట్యాడ తదితర ప్రాంతాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది.

సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ నమోదైన వర్షపాతం వివరాలు

కేంద్రం	మి.మీ.లు
పెందుర్తి జోనల్ కార్యాలయం	81
మేహాద్రిగెడ్డ రిజర్వాయర్	80.5
పెందుర్తి పీడబ్ల్యూడీ కార్యాలయం	79.5
వేపగుంట	66.75
కొత్తపాలెం	66
చీమలాపల్లి	54.75
బుచ్చిరాజుపాలెం	52.25

అధ్యయన యాత్రకు దూరం

- కొందరు కార్పొరేటర్ల నిర్ణయం
- ఇప్పటికే మేయర్, కమిషనర్‌లకు లేఖ అందజేసిన సీపీఎం కార్పొరేటర్ గంగారావు
- అదేబాటలో మరికొందరు

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తర భారతదేశ అధ్యయన యాత్రకు కొందరు కార్పొరేటర్లు విముఖత చూపుతున్నారు. ప్రజాధనం వెచ్చించి అధ్యయన యాత్ర పేరుతో విహార యాత్రలకు వెళ్లడం సరికాదని, అందుకే తాము తిరస్కరిస్తున్నట్టు మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లకు తెలియజేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు సోమవారం మేయర్, కమిషనర్‌లకు లేఖ పంపించగా, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అధ్యయన యాత్రకు తాను రాబోవడం లేదని అధికారులకు లిఖితపూర్వకంగా ఇప్పటికే సమాధానం ఇచ్చారు. అలాగే 91వ వార్డు కార్పొరేటర్ కుంచె జ్యోత్స్న, 92వ వార్డు కార్పొరేటర్ బెహరా స్వర్ణలత కూడా అధ్యయన యాత్రను బహిష్కరించాలని నిర్ణయించినట్టు తెలిసింది. 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి యాత్రకు దూరంగా ఉంటున్నట్టు ఇతర కార్పొరేటర్లకు తెలిపినట్టు సమాచారం.

గ్రేటర్‌లో గందరగోళం

ఇంజనీరింగ్ విభాగంలోని డ్రాయింగ్ బ్రాంచ్‌లన్నీ ఏడాది క్రితం జోనల్ కార్యాలయాలకు తరలింపు

- అందుకోసం ఒక్కో జోన్‌లో రూ.50 లక్షల వరకూ వ్యయం
- ఇప్పుడు మళ్లీ మెయిన్ ఆఫీస్‌కు మార్చాల్సిందిగా చీఫ్ ఇంజనీర్ ఆదేశాలు



- కాంట్రాక్టర్ల సౌలభ్యం కోసమేననే ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ అధికారులు తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు విమర్శలకు దారితీస్తున్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో పరిపాలనా సౌలభ్యం పేరుతో ప్రధాన కార్యాలయంలో ఉన్న డ్రాయింగ్ బ్రాంచ్ (డీబీ)లను ఏడాది కిందట సంబంధిత జోనల్ కార్యాలయాలకు తరలించారు. అందుకోసం రూ.లక్షలు వెచ్చించి అక్కడ సదుపాయాలు కల్పించారు. తాజాగా వాటన్నింటినీ అక్కడి నుంచి ప్రధాన కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగానికి మార్చాలని ఆదేశాలు జారీచేయడం చర్చనీయాంశంగా మారింది.

జీవీఎంసీ పరిధిలో ఏటా రూ.500 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. నగర పాలక సంస్థ పరిధిలో ఎనిమిది జోన్‌లు ఉండగా, ఆయా జోన్‌ల పరిధిలో పనులను పర్యవేక్షించేందుకు ఒక్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) జోనల్ కార్యాలయంలోనే ఉంటారు. పనులకు సంబంధించిన అంచనాల తయారీ, టెండర్లు పిలవడంతో సహా యంగా డ్రాయింగ్ బ్రాంచ్‌లు ఈఈ ఆధ్వర్యంలో ఉంటాయి. డీబీలన్నీ గతంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలో ఉండేవి. జోనల్ కార్యాలయాల నుంచి ఈఈలు ప్రధాన కార్యాలయానికి వచ్చి డీబీల వద్ద కూర్చొని పనులు పూర్తి చేయించుకోవడం, తిరిగి జోనల్ కార్యాలయాలకు వెళ్లడం ఇబ్బందిగా ఉండేది. దీంతో డీబీలు జోనల్ కార్యాలయంలో ఉంటే ఈఈలకు సౌలభ్యంగా ఉండడంతోపాటు కావాల్సిన సమాచారం సకాలంలో అందుబాటులో ఉంటుందని భావించి ఏడాది కిందట అప్పటి చీఫ్ ఇంజనీర్ రవికృష్ణరాజు వాటిని తరలించారు. జోనల్ కార్యాలయాల్లో డీబీలు కార్యకలాపాలు సాగించేందుకు వీలుగా అవసరమైన ఫర్నీచర్, సివిల్ వర్కులు, ఎలక్ట్రికల్ పనుల కోసం సగటున రూ.50 లక్షలు వరకు ఖర్చు చేసినట్టు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ మార్పు ఇంజనీరింగ్ అధికారులకు, డీబీల్లో పనిచేసే సిబ్బందికి కూడా విధి నిర్వహణకు సౌకర్యంగా ఉండడంతోపాటు సమయం కూడా ఆదా అవడంతో పనులు త్వరితగతిన పూర్తవుతున్నాయి.

ఇదిలావుంటే డీబీలను ప్రధాన కార్యాలయం నుంచి జోనల్ కార్యాలయాలకు తరలించడం వల్ల అధికారులు, సిబ్బందికి సౌకర్యంగా ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లకు మాత్రం కొంత ఇబ్బందిగా మారింది. కాంట్రాక్టర్లు ఏ జోన్ పరిధిలో వర్క్ చేస్తే ఆ జోనల్ కార్యాలయానికి వెళ్లి అక్కడి డీబీలతో తమ టెండర్లు, బిల్లులకు సంబంధించిన ... మిగతా 6వ పేజీలో

ఏయూ ఆడిట్ కార్యాలయంలో లైంగిక వేధింపులు

- అసభ్యకరంగా మెసేజ్‌లు పెడుతున్న ఉన్నతాధికారిని నిలదీసిన ఉద్యోగిని

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఆడిట్ కార్యాలయంలో లైంగిక వేధింపుల వ్యవహారం సోమవారం పెద్ద రచ్చకు దారితీసింది.



అసభ్యకరంగా మెసేజ్‌లు పెడుతూ వేధిస్తున్న డిప్యూటీ డైరెక్టర్‌పై ఓ ఉద్యోగిని విరుచుకుపడ్డారు. ఇప్పటికే బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఇది జరిగి రెండు రోజులు కాకుండానే మరోసారి మెసేజ్‌లు పెట్టడంతో సోమవారం ఆమె గట్టిగా నిలదీశారు. బుద్ధి మార్చుకోవాలంటూ హెచ్చరించారు. అనంతరం గొడవ పెద్దది కావడంతో విషయం డిప్యూటీ రిజిస్ట్రార్ దృష్టికి వెళ్లింది. అక్కడ సదరు ఉన్నతాధికారి వేధింపుల గురించి మహిళ ఉద్యోగి వివరించడంతో ఆయనకు చీవాట్లు పెట్టారు. పద్ధతి మార్చుకోవాలంటూ హితబోధ చేశారు. ఇదిలావుంటే ఈ తరహా వేధింపులు సదరు ఉన్నతోద్యోగికి కొత్త కాదని పలువురు పేర్కొంటున్నారు. గతంలోనూ ఇదే తరహా ఆరోపణలు ఉన్నాయంటున్నారు.

టీడీఆర్ హబ్‌లో ఇష్టారాజ్యం

నిబంధనలకు విరుద్ధంగా వందలాది మందికి పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించిన గత పాలకులు

- నోటిఫికేషన్ విడుదల నుంచి గైడ్ల కేటాయింపు వరకూ అంతా అస్తవ్యస్తం
- ఏయూ అధికారుల గుర్తింపు
- బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో?

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ (టీడీఆర్) హబ్ పేరుతో చేపట్టిన పీహెచ్‌డీ ప్రవేశాల్లో గత పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ ప్రవేశాలపై పెద్దఎత్తున ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి థీసెస్ సబ్మిట్ వరకూ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి దశలోనూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్టు నిర్ధారించారు.



టీడీఆర్ హబ్‌లో 2019 నుంచి 2023 వరకు సుమారు 1,200 మందికి పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించారు. సాధారణంగా పీహెచ్‌డీ ప్రవేశాలు డిపార్టుమెంట్‌ల వారీగా ఖాళీలను గుర్తించి చేపట్టాలి. కానీ, అందుకు విరుద్ధంగా వందలాది మందికి ప్రవేశాలు కల్పించారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, స్కూల్ టీచర్లకు గైడ్లుగా అవకాశం కల్పించారు. టెంపరరీ టీచింగ్ అరెంజ్‌మెంట్స్ కింద పనిచేసే వారికి కూడా అవకాశం ఇచ్చారు. అదేవిధంగా ప్రీ పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డీన్ ద్వారా ఇవ్వాలి. కానీ, నేరుగా టీడీఆర్ హబ్ ద్వారా ప్రవేశాలు కల్పించారు. అలాగే, యూనివర్సిటీ కాన్ఫిడెన్షియల్ డీన్ పేపర్ సెట్టింగ్ చేయాలి. యూనివర్సిటీలోని కాలేజీల వారీగా పరీక్ష నిర్వహించాలి. పేపర్ వాల్యూయేషన్ ప్రక్రియ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ద్వారా జరగాలి. కానీ, ఈ ప్రక్రియ అంతా టీడీఆర్ హబ్ ద్వారానే నిర్వహించారు. యూనివర్సిటీలో అంతర్భాగంగా ఉండాల్సిన టీడీఆర్ హబ్‌ను పూర్తిగా ప్రత్యేక అధికారాలు కలిగిన సంస్థ మాదిరిగా మార్చేశారు. యూనివర్సిటీలో ఫీజుల చెల్లింపు, ఇతర ఆర్థిక లావాదేవీలు రిజిస్ట్రార్ అకౌంట్ పేరుతో నిర్వహిస్తారు. కానీ, టీడీఆర్ హబ్‌లో డైరెక్టర్ పేరుతో ఆర్థిక లావాదేవీలు, ... మిగతా 6వ పేజీలో

లేఅవుట్లపై పెత్తనం!

అనుయాయులకు ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించాలని ప్రజా ప్రతినిధుల ఒత్తిడి

- తలలు పట్టుకుంటున్న హౌసింగ్ అధికారులు
- సంస్థ కార్యకలాపాల్లో మరో నేత పీఏ మితిమీరిన జోక్యం



విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలపై కొందరు కూటమి పార్టీ ప్రజా ప్రతినిధులు పెత్తనం చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని లేఅవుట్‌లలో నిర్మాణ బాధ్యతలను అనుయాయులకు అప్పగించాలని ఒత్తిడి తెస్తుండడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పైగా సంస్థలో అవినీతికి పాల్పడుతున్న కిందిస్థాయి అధికారులను వారు ప్రోత్సహిస్తుండంతో ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

నగరంలో గూడు లేని నిరుపేదల కోసం సుమారు 1.4 లక్షల ఇళ్లు నిర్మించేందుకు శివారు ప్రాంతాల్లో ఐదు వేల ఎకరాల్లో 73 లేఅవుట్లు వేశారు. వైసీపీకి అనుకూలురైన ప్రైవేటు నిర్మాణ సంస్థలకు అనధికారికంగా ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. అందులో లక్ష ఇళ్ల పనులు ప్రారంభించారు. గత ఏడాది ప్రభుత్వం మారడంతో నిర్మాణాలు చేపట్టిన పెద్ద సంస్థల యజమానులు ఆయా ప్రజా ప్రతినిధులను కలిశారు. అయితే ఎవరైనా తమను కలవలేదో..వారిని తప్పించాల్సిందిగా అధికారులపై కొందరు ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నారు. నగర శివారుకు చెందిన ఒక ప్రజా ప్రతినిధి తన పరిధిలో గల లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించే సమయంలో తన అనుయాయులకు పనులు అప్పగించాలని ఒత్తిడి తెచ్చారు. అప్పటికే పనులు చేస్తున్న కంపెనీలను తప్పించడంతో వివాదం రేగి పంచాయితీ అమరావతిలో పెద్దల వద్దకు చేరింది. గతంలో పనులు చేసిన వారినే కొనసాగించాలని ఉన్నతస్థాయి ఆదేశాలు వచ్చినా, సదరు ప్రజా ప్రతినిధి ససేమిరా అంటున్నారు. స్థానిక కూటమి పార్టీల నేతలు బుజ్జగించినా పట్టించుకోలేదు. అప్పటి నుంచి ఆయా లేవుట్‌లలో పనుల పురోగతిపై ప్రతిష్టంభన నెలకొంది. దీంతో హౌసింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

శివారు ప్రాంతంలో లే అవుట్‌లను పర్యవేక్షించే ఒక అధికారి అవినీతికి పాల్పడుతున్నప్పటికీ, సదరు ప్రజా ప్రతినిధి జోక్యం చేసుకోవడం విమర్శలకు దారితీసింది. కాగా నగరంలో మరో ... మిగతా 6వ పేజీలో

తీరంలో 'మిరాయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్



ప్రీ రిలీజ్ వేడుకలో నృత్యం చేస్తున్న చిత్ర బృందం

'మిరాయ్' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను సోమవారం సాగర తీరంలో నిర్వహించారు. హీరో హీరోయిన్లు తేజ, రితికా నాయక్, మంచు మనోజ్, మౌనిక దంపతులు, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రంగా తెరకెక్కించామన్నారు. - వివరాలు 8లో

స్టీల్ ప్లాంటులో బుగ్గి అవుతున్న బొగ్గు

- పట్టించుకోని యాజమాన్యం



ఆర్ఎంహెచ్‌పీలో కాలిపోతున్న బొగ్గు

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని రా మెటీరియల్ హ్యాండ్లింగ్ విభాగంలో బొగ్గు కాలిపోతోంది. అడపా దడపా వర్షాలు పడుతున్నా మంటలు తగ్గడం లేదు. స్టీల్ ప్లాంటులో థర్మల్ విద్యుత్ కేంద్రం నడపడానికి ఈ బొగ్గును ఉపయోగిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో నిల్వ చేస్తారు. అక్కడి నుంచి అవసరమైన ప్రాంతాలకు కన్వేయర్ల ద్వారా పంపిస్తారు. ఈ బొగ్గు నిల్వలు ఎండల వేడికి తగలబడిపోకుండా నిత్యం నీటిని విరజిమ్మడానికి కాంట్రాక్టు వర్కర్లు పనిచేస్తుంటారు. ఇటీవల యాజమాన్యం కాంట్రాక్టు వర్కర్లు ఎక్కువగా ఉన్నారని వేలాది మందిని తొలగించిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఇక్కడ బొగ్గు నిల్వలను పర్యవేక్షించే వారు కరవయ్యారు. గత నాలుగు రోజులుగా బొగ్గు కుప్పలు రాజుకుంటూనే ఉన్నాయి. ఈ విషయం యాజమాన్యం దృష్టికి వెళ్లినా నివారణ చర్యలు ఎందుకు చేపట్టలేదో తెలియడం లేదు. ఇలా బొగ్గు నిల్వలు కాలిపోతుంటే భారీగా నష్టాలు వచ్చే అవకాశం ఉంది. తక్షణమే యాజమాన్యం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.



స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలు

సింహాచలం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి భక్తులకు గ్రహణ సంప్రోక్షణ అనంతరం యథావిధిగా దర్శనాలు కల్పించారు. చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం ఉదయం 11.30 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనాలు నిలిపివేసి రాత్రి ఆరాధన, పవళింపు సేవ చేసి కవాట బంధనం చేశారు. సోమవారం ఉదయం సుప్రభాతసేవ అనంతరం శాస్త్ర విధానంలో సంప్రోక్షణలు చేసి, ప్రత్యేక పూజలు తరువాత ఉదయం 8 గంటలకు భక్తులకు దర్శనాలు కల్పించారు. అప్పటికే చాలామంది క్యూలో నిరీక్షించారు.

పద్మనాభంలో యూరియా కొరత లేదు : ఏఓ



అనంతవరంలో ఎరువుల పంపిణీ

పద్మనాభం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులందరికీ యూరియా అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ ఎంవీ చలం అన్నారు. సోమవారం ఉదయం ఆయన అనంతవరం. పెంట గ్రామాల్లో రైతులకు దగ్గరుండి యూరియాను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు ఎరువులు వస్తున్నాయని, రైతులు అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి పెద ఎర్నినాయుడు,ఏఎంసీ డైరెక్టర్ తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫిజియోథెరపీ దినోత్సవం

ఎండాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ వైద్య రంగంలో ఫిజియోథెరపీకి ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రధాన అంశంగా ఈ ఏడాది ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ విభాగం నిపుణుడు డాక్టర్ వంశీ, జిమ్‌సర్ ఆసుపత్రి జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నారాయణ మూర్తి, డీన్ ఎస్వీ రావు, తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో గుడిలోవ విద్యార్థుల ప్రతిభ

ఆనందపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ద్వారకా తిరుమలలో ఈనెల 6,7 తేదీల్లో పోటీలు జరిగాయి. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న దక్ష మహాలక్ష్మినాయుడు ఎనిమిది నుంచి పదేళ్ల విభాగంలో ప్రథమ స్థానంలో నిలవగా, 9వ తరగతి చదువుతున్న అవంతిక 14 నుంచి 16 ఏళ్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. వారిని నిర్వాహకులు వచ్చే నెల 9 నుంచి 12 వరకు కర్ణాటకలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలికలను ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ పోటీలకు భీమిలి విద్యార్థులు

భీమునిపట్నం : పట్టణంలోని జేజే పవర్ జిమ్ విద్యార్థిని మల్లేటి మౌనిక, ది సన్ స్కూల్ విద్యార్థిని రొక్కల తనూజ జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో ఈనెల 6, 7 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వారు ప్రతిభ చూపారు. 21-25 ఏళ్ల విభాగంలో మౌనిక ద్వితీయ స్థానం, రొక్కల తనూజ 14-16 ఏళ్ల విభాగంలో తృతీయ స్థానం పొందారు. ఈమేరకు వచ్చే నెలలో కర్ణాటక రాష్ట్రం మైసూరు, జార్ఖండ్‌లోని రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు.

డిసెంబర్ 31 నుంచి సీఐటీయూ సభలు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్గునాయుడు

తగరపువలస, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అఖిల భారత మహాసభలను డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్టు సీటూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. జగ్గునాయుడు తెలిపారు. సోమవారం చిట్టివలసలోని కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు దేశం నలుమూలలు నుంచి ఎంతోమంది హాజరవుతారని చెప్పారు. సభల్లో భాగంగా నగరంలో భారీ బహిరంగ సభ, ర్యాలీ ఉంటాయని తెలిపారు. కార్మికులంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భీమిలి జోన్ సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్. అప్పలనాయుడు, ఆటో రిక్షా, ముఠా, ఆశా, అంగన్‌వాడీ, తోపుడు బళ్ల కార్మికులు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన యువకుడి అరెస్ట్

గోపాలపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు యువకుల మధ్య జరిగిన వివాదం కొట్లాటకు దారితీసింది. దీంతో ఒక యువకుడిపై మరో యువకుడిపై కత్తితో దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..లక్ష్మీనగర్‌కు చెందిన మణికంఠ అలియాస్ మస్తాన్ (30) కంచరపాలెంలోని మటన్ షాపులో పనిచేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన మనోజ్ (27) కూలి పనులు చేస్తుంటాడు. ఆదివారం రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. అది సోమవారం ఉదయం కూడా కొనసాగింది. ఈక్రమంలో మణికంఠ మనోజ్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు సీఐ లెంక సన్యాశిరావు ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు కేసు నమోదు చేసి, మణికంఠను రిమాండ్‌కు తరలించారు.

అప్రంటీస్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధాని అప్రంటీస్ మేళాకు అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించింది. నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 510 మంది ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు హాజరయ్యారు. ఐటీఐ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రాథమికంగా 348 మందిని అప్రంటీస్ షిప్ శిక్షణకు ఎంపిక చేశారు.

చంద్రంపాలెం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి బ్రేక్ ?

- మెట్రో రైలు రాకే కారణం
- ఆ స్థానంలో అండర్‌పాత్ వే నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి



ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

మధురవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ జాతీయ రహదారిపై చేపట్టాలనుకున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం మెట్రో రైలు కారణంగా నిలిచిపోయినట్టు తెలిసింది. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ రహదారి దాటే సమయంలో తరచూ ప్రమాదాలకు గురవుతుండడంతో ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించారు. ఈమేరకు గత ప్రభుత్వంలో సుమారు రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి పాఠశాల ఆవరణలో శంకుస్థాపన కూడా చేశారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆచరణలోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మళ్లీ ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. నేరుగా జీవీఎంసీ రూ. 3.23 కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి కేటాయించింది. ఐదు నెలలు కిందట ఈ పనులను ప్రారంభిస్తామని అధికారులు తెలిపినప్పటికీ ప్రాజెక్టు అమలుకు మళ్లీ ఇబ్బందులు ఎదురైనట్టు సమాచారం. నగరం నుంచి కొమ్మాది కూడలి వరకు మెట్రో రైలు ప్రతిపాదన ఉండడంతో బ్రిడ్జి పనులకు బ్రేక్ పడినట్టు భోగట్టా. మెట్రో రైల్ ప్రాజెక్టు పనులు మొదలైతే జాతీయ రహదారి పైనుండే కొనసాగుతాయి. దానివల్ల మళ్లీ ఫుట్ ఓవర్ బ్రిడ్జి మార్చాల్సి ఉంటుంది. ఈ కారణంగా బ్రిడ్జి పనులు ఆగిపోయినట్టు సమాచారం. కాగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై ఇనుప రెయిలింగ్ వేసినప్పటికీ కొందరు విద్యార్థులు, ప్రయాణికులు వాటిని దాటడానికి ప్రయత్నిస్తున్నారు. గత నెల జాతీయ రహదారి దాటే క్రమంలో ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. గతంలో కొందరు విద్యార్థులు కూడా గాయపడ్డారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అడ్డంకులు ఎదురైతే చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఎదురుగా అండర్ పాత్‌వే నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

- ప్రతి పంచాయతీకి నిధులు
- స్థానిక సంస్థల ఎన్నికల్లోగా పనులు పూర్తి కావాలి
- ఎంపీపీ దంతులూరి వాసురాజు
- భీమిలి మండల సర్వ సభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొన్ని పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసే ప్రతిపాదన ఉందని, ఈ నేపథ్యంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ దంతులూరి వాసురాజు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఇంకనూ కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆయా పనులకు యుద్ధప్రాతిపదికన అంచనాలు రూపొందించి, నిధులు మంజూరు చేస్తామన్నారు. గ్రామీణులకు సేవ చేసే అవకాశాన్ని ఈ మూడు నెలల్లో ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గత ఏడాది మండలంలోని 16 పంచాయతీలకు మంజూరు చేసిన నిధుల వివరాలు చదివి వినిపించారు. పెండింగ్ పనుల పూర్తికి ప్రతి పంచాయతీకి రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకూ మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి మండలానికి స్టాంప్ డ్యూటీ సుమారు రూ.8 కోట్లు రావాల్సి ఉందని చెప్పారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు వెల్లడించారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు మాట్లాడుతూ తన సెగ్మెంట్‌లో అభివృద్ధి పనుల వివరాలు తెలియడం లేదని, తాగునీటి ఎద్దడి గురించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని ఆరోపించారు. నారాయణరాజుపేట సర్పంచ్ కాదాసూర్యనారాయణ మాట్లాడుతూ తన పంచాయతీలోనూ అదే పరిస్థితి ఉందన్నారు. ఈ దశలో అధికారులు సమర్థించుకోవడానికి చూడగా ఎంపీపీ జోక్యం చేసుకుని వితండ వాదం సరికాదని సూచించారు. అధికారులు ఏ గ్రామానికి వెళ్లినా. తొలుత అక్కడ ఎంపీటీసీ, సర్పంచ్ కు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

రెవెన్యూ శాఖపై ఫిర్యాదులు

రెవెన్యూ అధికారులు గ్రామాల్లో చేసిన రీసర్వే లోపభూయిష్టంగా ఉండడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు.తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. ఒక అధికారి, మరో అధికారిపై నెడుతూ సమస్యను పరిష్కరించడంల లేదని చెప్పారు. ఈ మేరకు సింగనబంద సర్పంచ్ జి. వెంకటనారాయణ మాట్లాడుతూ భూముల ధరలు పెరగక ముందు తాటితూరులో ఒక వ్యవసాయ భూమికి ల్యాండ్ కన్వెర్షన్‌కు దరఖాస్తు చేస్తే తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పనిచేశారని, కానీ ఆర్డీవో కార్యాలయంలో ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉందన్నారు. చిప్పాడలో వంద అడుగుల రహదారి నిర్మాణానికి వేసిన కొలతలపై సర్పంచ్ రమావతి ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీడీవో నరసింహారావు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, డిటి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయిని శ్రీదేవికి సన్మానం

భీమునిపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని సోమవారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఎం శ్రీదేవి జాతీయ అవార్డు పొందడం వల్ల పాఠశాలకు, పట్టణానికి ఎంతో గర్వకారణమన్నారు. అలాగే ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫాబ్), హిందూ ధర్మ పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కూడా శ్రీదేవిని సన్మానించారు. తొలుత వారు శ్రీదేవిని పోలీసుస్టేషన్ జంక్షన్ నుంచి ది సన్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్ల బ్యాండ్‌తో ఊరేగింపుగా పండిట్ నెహ్రూ స్కూల్‌కు తీసుకువచ్చారు. అక్కడ శ్రీదేవిని, ఆమె తల్లిదండ్రులు శ్రీరాములు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూ పరిరక్షణ సమితి కన్వీనరు మైలపల్లి షణ్ముఖరావు, ఫ్యాబ్ ప్రతినిధులు కాళ్ల సన్నీ, శ్రీనివాసరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు, ఫోరం ఫర్ బెటర్ భీమిలి అధ్యక్షుడు కృష్ణమూర్తి, మిషన్ గ్రీన్ అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.



శ్రీదేవిని సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

పీజీఆర్ఎస్‌కు పది వినతులు



జడ్పీ అయ్యప్పనాయుడుకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భీమునిపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు పది అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. రెవెన్యూ విభాగానికి 1, పట్టణ ప్రణాళికా విభాగానికి 4, ఇంజనీరింగ్ విభాగానికి 5 వినతులు అందాయని చెప్పారు. కాగా తన ఇంటి నిర్మాణ కొలతలు తప్పుగా నమోదు చేయడంతో సమస్యలు ఎదుర్కొంటున్నానని 4వ వార్డు కాపులుప్పాడకు చెందిన ఎంరెడ్డి ఉట్టోడు ఆవేదనవ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన పీజీ ఆర్ఎస్‌లో జడ్పీ అయ్యప్పనాయుడుకు టీడీపీ నాయకులు పాసి త్రినాథ్‌కుమార్, మరుపిళ్ల రాజేంద్రప్రసాద్‌తో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఇంటికి ఎస్ఎఫ్‌టీ 800 ఉండగా, గత ప్రభుత్వంలో 1200 చూపడంతో నిరుపేద కుటుంబమైన తనకు ఏ సంక్షేమ పథకం కూడా అందడం లేదన్నారు. రీ సర్వే చేసి ఇంటి కొలతలు సరిదిద్దాలని కోరారు.

వరి రైతులకు అధికారుల సూచనలు



వరి సాగు గురించి రైతులకు వివరిస్తున్న ఎంఎంటీఎల్ గణేశ్

పద్మనాభం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా వరిని కూడా ఆరు తడి పంటల విధానంలో తక్కువ నీటి వనరులతో పండించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎంఎంటీఎల్ గణేశ్ చెప్పారు. సోమవారం ఆయన పాండ్రంగి గ్రామంలో ప్రకృతి సేద్యం ద్వారా తక్కువ నీటి యాజమాన్య పద్ధతిలో వరి పండించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విధానం వల్ల వరిని ఆశించే పురుగులు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. పిలకలు కూడా వృద్ధి చెందుతాయన్నారు. రైతులకు విద్యుత్ కూడా పొదుపు అవుతుందని చెప్పారు. వరిలో నీరు ఎంతవరకు ఉంచాలో గుర్తించడానికి ఫీల్డ్ వాటర్ ట్యూబ్ పరికరాన్ని అమర్చుతామన్నారు. దీని ద్వారా ఎంతవరకు నీరు పొలంలో ఉంచవచ్చో నిర్ధారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ విభాగం సిబ్బంది వనజ, ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి నారాయణమ్మ, కూటమి నాయకులు మహంతి అప్పలరమణ (శ్రీను), సోమేశ్వరరావు, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్ కొండపై ఆక్రమణలు తొలగింపు

ఎండాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ హయగ్రీవ కొండ కింద ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాన్ని రెవెన్యూ సిబ్బంది సోమవారం తొలగించారు. రాజీవ్‌నగర్ కొండవాలు ప్రాంతంలో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ప్లాట్లుగా వేసి షెడ్లు నిర్మిస్తున్నారు. వాటిని రూ. 18 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా..ఆక్రమణదారులు వాటిని తొలగించి, మరీ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆక్రమణ గురించి చినగదిలి తహసీల్దార్‌కు నివేదించామని వీఆర్వో వెంకటేశ్ చెప్పారు. త్వరలోనే అన్ని ఆక్రమణలు తొలగిస్తామన్నారు.

'భీమిలికి అదనపు బస్సులు నడపాలి'

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న భీమిలికి అదనపు బస్సులు వేయాలని సామాజిక కార్యకర్త బల్ల వెంకటరావు కోరారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గతంలో అనేక ప్రైవేటు బస్సులు పలు ప్రాంతాల నుంచి భీమిలి వచ్చేవని, ప్రైవేటు సర్వీసులు రద్దు చేసిన తర్వాత ఆర్టీసీ బస్సులు వేయలేదన్నారు.భీమిలి నుంచి విజయనగరం, శ్రీకాకుళం వెళ్లడానికి ఒక్క బస్సు కూడా లేదని చెప్పారు. సింహాచలం, శ్రీకూర్మం కలుపుతూ భీమిలి మీదుగా ఒక బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే తగరపువలస భీమిలి మధ్య సిటీ బస్సులు వేయాలని విన్నవించారు. నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్సును వినియోగంలోకి తీసుకురావాలని కోరారు,

మహిళల వరల్డ్ కప్ క్రికెట్ ట్రోఫీ ప్రదర్శన



బీచ్‌రోడ్డులో ప్రదర్శించిన ట్రోఫీ వద్ద యువత సందడి

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):తొలిసారిగా మహిళల ఐసీసీ ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీకి విశాఖ ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో ప్రచారంలో భాగంగా సోమవారం బీచ్‌రోడ్డులోని టీయూ 142 వద్ద ట్రోఫీని ప్రదర్శనకు ఉంచారు. సెప్టెంబరు 30 నుంచి జరగనున్న వుమెన్ వరల్డ్ కప్ క్రికెట్ టోర్నీలో ఐదు మ్యాచ్‌లకు విశాఖ కూడా ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ట్రోఫీ ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. బీచ్ రోడ్డు సందర్శనకు వచ్చిన యువతీ యువకులు వరల్డ్ కప్ ట్రోఫీ వద్ద ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు. వరల్డ్ కప్ ట్రోఫీని తొలిసారిగా నేరుగా చూసే అవకాశం కలగడంతో సందర్శకులు ఆనందం వ్యక్తం చేశారు.

రాజకీయ లబ్ధి కోసం వైసీపీ వెంపర్లాట

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



భీమునిపట్నం,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ లబ్ధి కోసం వైసీపీ వెంపర్లాటలో భాగమే ఈనెల 9న భీమిలిలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమం అని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు.ఈమేరకు సోమవారం ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. నియోజకవర్గంలోని రైతులకు దాదాపు 90 శాతం యూరియా అందించామన్నారు. వారికి కూడా అందుబాటులో ఉన్నప్పటికీ అన్నదాత పోరు పేరుతో వైసీపీ మంగళవారం ఆందోళనకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందని చెప్పారు.భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో రైతులు 9,161 ఎకరాల్లో వరి వేశారు. ఇతర పంటలు 669 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మరో 25,842 ఎకరాల్లో ఉద్యానవన పంటలు పండిస్తున్నారు. వరికి 1,237 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, రైతు సేవా కేంద్రాల ద్వారా 539, ప్రైవేట్ డీలర్ల ద్వారా 541 మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటికే పంపిణీ చేశామని చెప్పారు. ఇంకా రైతు సేవా కేంద్రాల్లో 168, ప్రైవేట్ డీలర్ల వద్ద 50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా లేదని వైసీపీ నాయకులు ఎందుకు ఆందోళన చేస్తున్నారో వారికే తెలియాలన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ వెంపర్లాట అని విమర్శించారు.

గ్రేటర్‌లో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

పనులు ఎంతవరకు జరిగాయి? ఏస్థాయిలో ఉన్నాయనేది తెలుసుకోవాల్సి వస్తోంది. అదే ప్రధాన కార్యాలయంలో అన్ని జోన్‌ల డీబీలు ఉంటే ఒకచోట సమాచారం తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని కొందరు కాంట్రాక్టర్లు భావించారు. అనుకున్నదే తడవుగా తమ ప్రతిపాదనను జీవీఎంసీ ఉన్నతాధికారుల ముందుంచారు. అప్పటికే ప్రధాన కార్యాలయం నుంచి జోనల్ కార్యాలయాలకు డీబీలు తరలించి, వాటికి మౌలిక వసతుల కోసం రూ.లక్షలు వ్యయం చేశామని వివరించి, కాంట్రాక్టర్ల ప్రతిపాదనను తిరస్కరించాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఆశ్చర్యానికి గురిచేసింది. జోనల్ కార్యాలయల్లో డీబీల కోసం చేసిన ఖర్చు విషయాన్ని మరిచిపోయి, తక్షణం డీబీలను ప్రధాన కార్యాలయానికి తీసుకురావాలంటూ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ రాజు ఇటీవల ఆదేశాలు జారీచేశారు. అధికారుల ఆదేశాలను జీవీఎంసీలోని ఇంజనీరింగ్ అధికారులే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కాంట్రాక్టర్లతో వ్యక్తిగత సంబంధాలు కారణంగానే అధికారులు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తుండడం గమనార్హం.

టీడీఆర్ హబ్‌లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఫీజులు వసూలు ప్రక్రియ నిర్వహించారు. థీసెస్‌ను యూనివర్సిటీ సెక్షన్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆధ్వర్యంలో సబ్మిట్ చేసేలా చూడాలి. కానీ, చాలామంది నేరుగా టీడీఆర్ హబ్‌లోనే సమర్పించారు. నిబంధనలను పూర్తిగా విస్మరించి అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడినట్టు అధికారులు గుర్తించినట్టు తెలిసింది. మరి అందుకు బాధ్యులైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చూడాలి. ప్రవేశాలు పొందిన వారిలో కొందరికి ఇప్పటికే పీహెచ్‌డీలను మంజూరుచేయగా, మరికొందరివి పెండింగ్‌లో ఉన్నాయి. వారంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలు పొంది ఇప్పటికీ పీహెచ్‌డీ పట్టా తీసుకోని వారికి అన్యాయం జరగకుండా, న్యాయపరమైన చిక్కులు భవిష్యత్తులో ఎదురుకాకుండా సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

లేఅవుట్లపై పెత్తనం!

... 5వ పేజీ తరువాయి

ప్రజాప్రతినిధి కూడా జోక్యం చేసుకుని కొన్ని లేఅవుట్‌లను తాను చెప్పిన వ్యక్తులకు ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో అధికారులు ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికే పనులు చేస్తున్న కాంట్రాక్టరును ఎందుకు తప్పించాలని అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది నుంచి సంస్థ కార్యకలాపాలపై జోక్యం చేసుకుంటున్న మరో నేత పీఏ ఒకరు ఇటీవల మళ్లీ పైరవీలు చేస్తున్నారు. గతంలో హౌసింగ్‌లో పనిచేసి రిటైరైన తరువాత పీఏగా చేరిన ఆ వ్యక్తి, హౌసింగ్ విభాగంపై పెత్తనం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా కిందిస్థాయిలో పనిచేసే ఇద్దరు అధికారుల అవినీతి వ్యవహారం సంస్థకు తలనొప్పిగా పరిణమించింది. మందకొడిగా పనులు చేసే సంస్థలను నిర్మాణ బాధ్యతల నుంచి తప్పిస్తామని పైస్థాయి అధికారులు హెచ్చరికలు చేయగా, కిందిస్థాయి అధికారులు వారికి అభయం ఇస్తున్నారు.



విస్తరణకు నోచుకోని తగరపువలస జంక్షన్

ఇరుగ్గా తగరపువలస కూడలి

- రోడ్డుకి ఇరువైపులా పెరుగుతున్న ఆక్రమణలు
- తరచూ ట్రాఫిక్ ఇబ్బందులతో నరకయాతన
- విస్తరణకు నోచుకోని రహదారి
- పట్టని అధికారులు



జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు

తగరపువలస, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాలుగు మండలాలకు కేంద్రంగా ఉన్న తగరపువలస కూడలి ఇరుగ్గా మారింది. బస్సులు తప్పుకోవడానికి కూడా అవకాశం ఉండడం లేదు. కూడలి మధ్యలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వల్ల విజయనగరం నుంచి వచ్చే బస్సులను మలుపు తిప్పడానికి డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు 30 ఏళ్ల క్రితం ఈ కూడలిని విస్తరించారు. చాలా దుకాణాలను తొలగించారు. ప్రస్తుతం రోడ్డు మధ్యలో డివైడర్ పై వ్యాపారాలు చేయడంతో పాటు విస్తరించిన రహదారి వద్ద ఉన్న దుకాణాల ముందు ఆక్రమణలు పెరిగిపోయాయి. కొన్ని దుకాణదారులు తోపుడు బళ్ల వ్యాపారాలు చేసుకునే వారికి ముందున్న స్థలాలను అద్దెకు ఇస్తున్నారు. దీంతో రహదారి వెడల్పు తగ్గిపోయింది. వైఎస్ ఆర్ కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకూ ఇదే పరిస్థితి. ఈ రహదారి వద్దే ప్రైవేటు సంత కూడా ఉంది సంతలో స్థలాలు లేని వారు రహదారులపైనే వ్యాపారాలు చేస్తున్నారు. గతంలో అన్ని బస్సులు ఈ రూటులో వచ్చేవి. ప్రస్తుతం రహదారి ఇరుకు కావడంతో ఎక్స్‌ప్రెస్ బస్సులు జాతీయ రహదారి పై నుంచి వెళ్లిపోతుండగా సిటీ బస్సుల్లో కొన్ని మాత్రమే ఈ కూడలికి వస్తున్నాయి. బస్సులు నిలపడానికి అవకాశం లేకపోవడంతో సినిమా హాలు వద్ద నిలుపుదల చేసి సమయం తర్వాత తీసుకు వస్తున్నారు. గతంలో విజయగనరం, విశాఖపట్నం, భీమిలి రూట్లలో వెళ్లే వాహనాల కోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం మూడు బస్ షెల్టర్లు ఉండేవి. ఫ్లైఓవర్ బ్రిడ్జి వచ్చిన తరువాత వాటిని తొలగించారు. మళ్లీ పునర్నిర్మించకపోవడంతో ప్రయాణికులు దుకాణాల ముందు బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. మూడు బస్ షెల్టర్లను మళ్లీ నిర్మించాలని చాలా కాలంగా స్థానికులు కోరుతున్నా..పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో కూడలిని విస్తరించడంతో పాటు బస్ షెల్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వేలం లడ్డూతో కమిటీ సభ్యులు

రూ. లక్ష పలికిన లడ్డూ

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ టీటీడీ సర్కిల్ వద్ద విశాఖపట్నం రియల్ ఎస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఉత్సవాలలో లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా రూ.లక్ష పలికింది. ముగింపు ఉత్సవాల సందర్భంగా లడ్డూ, రుద్రాక్షలను కమిటీ వేలం వేసింది. ఇందులో లడ్డూను రూ.లక్షకు సునీల్ అనే వ్యక్తి పాడుకున్నారు.రుద్రాక్షలను కూడా మాధవ స్వామినాయుడు అనే వ్యక్తి రూ. 30 వేలకు పాడుకున్నారు.కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు తారక్, రాయల మల్లికార్జున్, నర్సింహారావు, గేదెల శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, జ్యోతిబసు, రమణ, అమర్, గోవింద్, చంటి, సత్యనారాయణ, శ్రీకాంత్, రాంబాబురెడ్డి పాల్గొన్నారు.

కూటమి పాలన మహిళలకు శాపం : వైసీపీ

మద్దిలపాలెం,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలన మహిళలకు శాపంగా మారిందని వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి విమర్శించారు. మద్దిలపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలకు రక్షణ కూడా కల్పించలేని విధంగా ప్రభుత్వ పాలన ఉందన్నారు. కూటమి పాలనలో మద్యం ఏరులై పారుతోందని, ఎక్కడి పడితే అక్కడ బెల్ట్‌షాప్‌లు తెరిచారని ఆరోపించారు.మద్యం మత్తులో మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. వైఎస్ జగన్ పాలనలో దిశ యాప్‌తో నేరాలు అరికట్టారని, ఆ యాప్ ద్వారా జగన్‌కు పేరు వస్తుందని దాన్ని తీసేశారన్నారు. ఈ సమావేశంలో మహిళా నాయకులు శ్రీదేవివర్మ, శశికళ, వరలక్ష్మి, నమ్మి లక్ష్మి పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వెంకోజీపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం సాయిబాబా ఆలయంలో సోమవారం క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.60 ఏళ్ల పైబడిన వారిని తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, డాక్టర్ చరణ్, టీబీ సూపర్‌వైజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 18, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 38, బంగాళదుంపలు 20, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 40,అల్లం (పాతది) 70, బరబాటి 36, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276



డ్రైనేజీల ద్వారా సముద్రంలోకి చేరుతున్న మురుగు నీరు



మురుగుతో సముద్ర జలాలు కలుషితం

- మృత్యువాత పడుతున్న జలరాశులు
- నియంత్రణలో జీవీఎంసీ విఫలం
- మత్స్య సంపదకు అపార నష్టం

బీచ్ రోడ్డు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరం నుంచి వచ్చే మురుగునీరు సుమద్రంలో కలిసిపోవడంతో జలాలు పూర్తిగా కలుషితమవుతున్నాయి. ఈ కారణంగా మత్స్య సంపద నాశనమవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సముద్ర జలాల కాలుష్యం వల్ల సుమారు 20 వేల మత్స్యకార కుటుంబాల ఉపాధి సన్నగిల్లుతోంది. కలుషిత నీటితో తీరానికి నష్టం వాటిల్లుతూ, ప్రజల ఆరోగ్యంపై ఎంతటి దుష్ప్రభావం చూపుతుందో ఆలోచించాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. స్వర్ణాంధ్ర... స్వచ్ఛాంధ్ర ..అని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో జిల్లాలోని ప్రతి నెలా పలుచోట్ల చెత్త తొలగించే పనులు సాగుతున్నాయి. అయితే ఆర్కే బీచ్ సాగర తీరంలో పేరుకుపోయిన చెత్త, కలుషితమవుతున్న తీరాన్ని గాలికొదిలేశారు. మురుగు నీటి కాలువల ద్వారా వ్యర్థాలెన్నో ప్రతిరోజు సముద్రంలో కలుస్తున్నాయి. ప్లాస్టిక్ వస్తువులు సముద్ర జలాల్లో కలిసి మళ్లీ ఒడ్డుకు కొట్టుకువస్తున్నాయి. సందర్శకులు తమతో తీసుకొచ్చిన తినుబండారాలు, సంచులను బీచ్ వద్ద పారవేస్తున్నారు. దీంతో అందమైన తీరం అపరిశుభ్రంగా మారిపోతోంది. సముద్రంలో ప్రమాదకర రసాయనాలు కలవడంతో ప్రజలకు, జీవరాశులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా తాబేళ్ల, సముద్రంలో జీవరాశులు ఆక్సిజన్ అందక మృతి చెందుతున్నాయని చెబుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరిస్తే తీరానికి వచ్చే సందర్శకులు కాస్త ఉపశమనం పొందుతారు. తీరంలో శుభ్రతకు అందరూ కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా డ్రైనేజీ పనులు

- అధికారుల పర్యవేక్షణ కరువు
- రాకపోకలకు స్థానికుల అవస్థలు



మంగాపురం కాలనీ ఎఫ్ఎఫ్‌టీ స్కూల్ దరి రోడ్డుపై వేసిన నిర్మాణ సామగ్రి

మద్దిలపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక 22వ వార్డు మంగాపురం కాలనీలో ఇష్టారాజ్యంగా డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. స్థానికులకు నడవడానికి కూడా అవకాశం లేకుండా మట్టి కుప్పలు పోశారు. మంగాపురంకాలనీ ఎఫ్ఎఫ్‌టీ స్కూల్ సమీపంలోని వీధిలో డ్రైనేజీ పనులు చేపట్టారు. ఈ పనుల కోసం రోడ్డుకుఇరువైపులా తవ్వేసి మట్టిని రోడ్డుపై వేశారు. అంతేకాకుండా డ్రైనేజీ నిర్మాణాల కోసం ఇసుక, పిక్క రోడ్డు మధ్యలో నిల్వ చేశారు. దీంతో ఆ రోడ్డులో ప్రయాణాలు చేయలేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇంటి ముందు పలకలు విరగ్గొట్టడం వల్ల బయటకు రాలేకపోతున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. మట్టిని తీయాలని కాంట్రాక్టర్‌ను కోరినా స్పందించడం లేదని వాపోతున్నారు. బాగున్న డ్రైనేజీలను విరగ్గొట్టి నిర్మాణం చేపట్టడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేయడమే కాకుండా రాకపోకలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు. వాస్తవానికి రోడ్డుకు ఒకవైపు కాల్వ నిర్మాణం పూర్తి చేసి, ఆ తరువాత మరోపక్క పనులు చేపడితే ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదు. కాని కాంట్రాక్టర్ ఒకేసారి రెండువైపులా కాల్వలు విరగ్గొట్టడం వల్ల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి మట్టిని వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్టీల్‌సిటీ డిపోను కొనసాగించాలి

- ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ ప్రతినిధులు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్టీల్‌సిటీ డిపోను అక్కడే కొనసాగించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, కోశాధికారి పీవీవీ మోహన్, రీజనల్ కార్యదర్శి శంకరరావు విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్టీల్‌సిటీ డిపోను ఖాళీ చేయాలని ఉక్కు యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులపై ఎన్ఎంయూఏ రాష్ట్రకమిటీ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి సమస్యను వివరించామన్నారు. డిపో అక్కడే కొనసాగే విధంగా జిల్లా అభివృద్ధి మండలి సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ వాల్తేరు డిపో అధ్యక్షుడు పీజీ పతి, కార్యదర్శి ఆర్. వసంతరావు, జిల్లాలోని అన్ని డిపోల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

గీతం వర్సిటీలో 'తెలుగు టైటాన్స్' సందడి



వర్సిటీలో తెలుగు టైటాన్స్ కబడ్డీ క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12 టోర్నీ ప్రచారంలో ఆతిథ్య తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు సోమవారం గీతం యూనివర్సిటీలో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గేమ్స్, క్విజ్ పోటీల్లో విద్యార్థులతో పాటు పాల్గొని ఉత్సాహపరిచారు. అనంతరం తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్‌మాలిక్ మాట్లాడుతూ కబడ్డీ తన జీవితాన్ని మార్చిందని, చిన్న గ్రామం నుంచి తనను ప్రపంచానికి పరిచయం చేయడమే కాకుండా అన్ని రకాలుగా తన కుటుంబానికి అండగా నిలబడగలిగే శక్తిని ఇచ్చిందని చెప్పారు. అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ప్రపంచ స్థాయి వేదికపైకి చేరుకోగలమని తెలిపారు. దేశంలో ప్రతిభ గల కబడ్డీ క్రీడాకారులకే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లకు పీకేఎల్ అద్భుతమైన ప్లాట్‌ఫామ్‌గా నిలిచిందన్నారు. అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ప్రపంచ స్థాయి వేదికపైకి చేరుకోగలమని తెలిపారు. అనంతరం ఆటగాళ్లు ఆటోగ్రాఫ్ చేసిన టీషర్టును గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్ కార్తీక్, ప్రసాదరావు, టైటాన్స్ ఆటగాళ్లు ఆవిష్కరించారు.



విజేతలకు బహుమతులు ఇస్తున్న పీఎస్ అవధాని, తదితరులు



అతిథులను సన్మానిస్తున్న ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు, అధ్యాపకులు

వికసిత్ భారత్ సాకారానికి విద్య కీలకం

- ఐఐటీ అగర్తల పూర్వ సంచాలకులు ప్రొఫెసర్ పీఎస్ అవధాని
- ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సాకారం కావడంలో విద్య కీలకమని ఐఐటీ అగర్తల పూర్వ సంచాలకులు పీఎస్ అవధాని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రమోటింగ్ లిటరసీ ఇన్ ద డిజిటల్ ఎరా అంశంపై అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం-2025ను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ ఏఐ సాంకేతికతతో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోందని, అదే సమయంలో మానవునిలో సృజనాత్మక శక్తి లోపిస్తోందన్నారు. నూతన సాంకేతికతల వినియోగం ఫలి తంగా పర్యావరణం దెబ్బతింటున్న విధానాని వివరించారు. యువత భవిష్యత్తులో భారతావనికి మూల స్తంభాలుగా నిలవాలని సూచించారు. దీనికి నూతన నైపుణ్యాలను అందిపుచ్చుకోవడం అవసరమన్నారు. విద్యార్థులకు అవసరమైన అధీకృత డిజిటల్ కంటెంట్‌ను తీర్చిదిద్దడం పెద్ద సవాల్‌గా నిలుస్తోందన్నారు. అక్షరాస్యత సాధన నుంచి కంప్యూటర్ అక్షరాస్యత దిశగా పయనించి ప్రపంచం నేడు డిజిటల్ అక్షరాస్యత దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికతలను ప్రభావంతంగా పనిచేస్తున్నప్పటికీ పుస్తకం ప్రాధాన్యత తగ్గకూడదని, నూతన సాంకేతికతలు పుస్తకానికి ప్రత్యామ్నాయం కాబోవన్నారు. డిజిటల్ విధానాలకు అలవాటు పడిన యువత అభ్యసనాన్ని వాయిదా వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వక్తృత్వపోటీ విజేతలుగా నిలిచిన విద్యార్థులు తమ ఆలోచనలను వేదికపై పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ ప్రగతి

సమాజ అభివృద్ధికి విద్య మార్గం చూపుతుందని కుప్పంలోని ద్రవిడయన్ యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. ఆదినారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడారు. వ్యక్తి ప్రగతికి, సమాజ అభ్యున్నతికి విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ నరసింహరావు మాట్లాడుతూ విద్యావంతులే దేశం బలమైన శక్తి అని చెప్పారు.వేద కాలం నుంచీ భారత్ జ్ఞాన కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. ప్రపంచ దేశాల నుంచి విదేశీయులు వచ్చి భారతీయ విశ్వవిద్యాలయాల్లో విద్య అభ్యసించే వారిని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలను నడిపిస్తున్న ఎంతోమంది భారతీయులేనని తెలిపారు. విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ టి. షారోన్ రాజు మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను గ్రామీణ ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ వజీర్ మహ్మద్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తిరుమల శ్రీదేవి, క్రీడా విభాగం సంచాలకుడు ప్రొఫెసర్ విజయ్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి విద్యా పరిషత్‌లో..

పెదవాల్తేరు : బీచ్ రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థు లకు పోస్టర్ మేకింగ్, చదవడం, రాయడం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. మధురవాణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి జిల్లాస్థాయి డ్యాన్స్ పోటీలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దసరా పురస్కరించుకుని ఈ నెల 13, 14 తేదీల్లో జిల్లాస్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు స్కూల్ ఆఫ్ థియేటర్స్ ఆర్ట్స్ డైరెక్టర్ ఆర్. జానకి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంటీసీ కాలనీలోని వెంకటేశ్వర గుడి ఎదురుగా ఉన్న ఏపీఎస్ఈబీ కాలనీ సమావేశ మందిరంలో 13న ఉదయం 10 గంటల నుంచి ఈ పోటీలు శాస్త్రీయ, జానపద సోలో డ్యూయెట్ అంశాల్లో జరుగుతాయన్నారు. 13 ఏళ్లలోపు వారిని జూనియర్స్ గాను, 14 నుంచి 18 ఏళ్ల లోపు వారిని సీనియర్స్ గానూ పోటీల్లో పరిగణి స్తామన్నారు. రెండు విభాగాల్లోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. పాల్గొన్న ప్రతీ నృత్య కళాకారునికి ప్రశంసా పత్రాలు అందిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే కళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శన అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల నృత్య కళాకారులు ఈ నెల 11లోపు ఫోన్ నెంబరు (85229 90123)లో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని జానకి ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఘనంగా వరల్డ్ ఫిజియోథెరపీ డే



ఫిజియోథెరఫిస్ట్ ప్రియాంకను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

పెదవాల్తేరు,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిస్వార్థంగా 200 మంది మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేస్తూ కన్న పిల్లలుగా చూసుకుంటున్న ఫిజియోథెరపిస్ట్ ప్రియాంక సేవలు వెలకట్టలేనివని పాఠశాల వ్యవస్థాపకులు కండిపిల్లి శ్రీనివాసరావు అన్నారు. వరల్డ్ ఫిజియోథెరపిస్ట్ దినాన్ని పురస్కరించుకుని సోమవారం పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో ప్రియాంకను పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులను శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు,చీరలు అందజేసి అభినందించారు. పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల శారీరక వికాసం, ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభ్యున్నతికి అమె అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. విద్యార్థులలో నూతనోత్సాహాన్ని నింపుతూ, వారి జీవితాలలో మార్పు తీసుకురావడానికి ఆమె చేస్తున్న కృషి అమోఘమన్నారు. డైరెక్టర్ మధు, ఉపాధ్యాయులు సురేష్, పద్మ, సరళ, స్వాతి, శైలజ, రాజు పాల్గొన్నారు.

హిజ్రాలకు నైపుణ్య అభివృద్ధిలో ఉచిత శిక్షణ

పెదవాల్తేరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హిజ్రాలకు నైపుణ్య అభివృద్ధిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు,హిజ్రాలు, వయోవృద్ధుల సహాయ సంచాలకురాలు కె.కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జాతీయస్థాయి ఐటీ/ఐటీఈఎస్ రంగాలలో ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుందన్నారు. అభ్యర్థులకు ఇంటర్మీడియట్/డిగ్రీ విద్యార్హత ఉండాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని ఆసక్తి గల హిజ్రాలు దరఖాస్తులు పొందవచ్చునన్నారు. ట్రాన్స్ జెండర్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, విద్యార్హతల నకళ్లతో పూర్తి చేసిన దరఖాస్తులను తమ కార్యాలయానికి అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 0891-2952585 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

శివాలయాల్లో గ్రహణ దోష నివారణ పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణ దోష నివారణ కోసం సోమవారం పెదగదిలి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆరిలోవలో గల అన్ని శివాలయాల్లో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. పెదగదిలిలోగల కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్లపై పశువుల సంచారం



రహదారిపై సంచరిస్తున్న ఆవులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మూగజీవులు వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారాయి. రోడ్లపై పశువుల సంచారాన్ని కట్టడి చేయకపోవడంతో రోజురోజుకూ ఈ సమస్య ఇబ్బందికరంగా మారుతోంది. 16వ వార్డు హెచ్‌బీకాలనీ సులభ్‌కాంప్లెక్సు ప్రాంతంలో రోడ్లపైనే గోవులు నిలిచి ఉంటుంటాయి. ఆవులు పడుకుని ఉండటంతో రాత్రి పూట వేగంగా వచ్చే వాహనచోదకులకు నిద్రించే గోవులు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం అర్ధరాత్రి స్నేహితుని పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకుని వస్తున్న ఓ యువకుడు గోవును ఢీకొట్టి ప్రాణాలు కోల్పోయాడు. ఆవు కూడా కన్నుమూసింది. ఆ తరువాత కొంతకాలం ఆవులను నిరోధించారు. కానీ మళ్లీ మామూలు పరిస్థితి తారాడుతోంది. ఆవులను పోషకులు రోడ్లపైకి వదిలేస్తున్నారు. వాహనచోదకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న గోవుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మద్దిలపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని వెంకటేశ్వర సప్లయిర్స్ షాప్‌లో పని చేస్తున్న వ్యక్తి సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తెలంగాణలోని సికింద్రబాద్ బేగంపేట సమీపం లో బ్రహ్మనువాడి ప్రాంతానికి చెందిన పప్పు రమేష్ కామత్ (46) మూడు నెలలు కిందట వెంకటేశ్వర సప్లయిర్స్ షాప్‌లో పనికి చేరాడు. సోమవారం ఉదయం దుకాణం వద్ద రమేశ్ మృతి చెందినట్టు షాప్ నిర్వాహకులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ముందు రోజు రాత్రి రమేశ్‌కు ఫిట్స్ వచ్చినట్టు దుకాణంలో పని చేస్తున్న వారు చెబుతున్నారు. ఈ కారణం గానే అతను మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

చికిత్సల కోసం పిల్లల తరలింపునకు ఉచిత వాహనం ప్రారంభం

సీతంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పద్దెనిమిదేళ్లలోపు పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి చికిత్సల నిమిత్తం ఉపయోగించేందుకు ఆర్‌బీఎస్‌కే వాహనాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు సోమవారం జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో వైకల్యాన్ని తగ్గించడానికి అంగన్వాడీ కేంద్రాలు, సామాజిక, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి కేజీహెచ్‌లో గల డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు రిఫర్ చేయాలన్నారు. ముఖ్యంగా జనన సమయంలో ఇబ్బందులను వైద్యాధికారులు గుర్తించి ఉచిత సలహా, చికిత్సల కోసం ఈ ప్రత్యేక వాహనంలో తరలిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్. రమేష్, డాక్టర్ హారిక, బి.నాగేశ్వరరావు, డాక్టర్ కె.అప్పారావు, ఎన్టీఆర్ వైద్య సేవ ప్రతినిధి శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఆందోళనలు

మహారాణిపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సకాలంలో సదరం సర్టిఫికెట్లు మంజూరు చేసి పెన్షన్లు అందజేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్ల ప్రాతిపదికన వైకల్య శాతాన్ని యథావిధిగా కొనసాగించి అర్హులకు పెన్షన్లు కొనసాగించాలని, దివ్యాంగులకు ఇచ్చిన నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దసంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని సినర్జీస్ ఉద్యోగుల వినతి

సినర్జీస్ యాజమాన్యం ఉద్యోగులకు ఏడు నెలలుగా జీతాలు చెల్లించటం లేదని, పదేళ్లుగా బోనస్ చెల్లించడం లేదని, ఈ బకాయిలు ఇవ్వాలని కోరుతూ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. వీఈపీజెడ్ సినర్జీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. పీఎఫ్, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కూడా రావడం లేదని, కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు.

బకాయిలు విడుదల చేయండి

ఇమామ్, మౌజమ్‌లకు 11 నెలలుగా బకాయి పడ్డ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ముస్లిం మైనారిటీలు కలెక్టర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్ట రేట్‌లో వైసీపీనాయకులు, ముస్లిం మత పెద్దలు కలసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింలకు భద్రత కల్పించాలని రాజ కీయంగా, ఆర్థికంగా అండగా ఉండాలని కోరారు. ఎన్నికల సమయంలో మైనారిటీలకు ఇచ్చిన హామీ లను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, భర్కత్ అలీ, రవిరెడ్డి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద వైసీపీ నాయకులతో కలిసి ముస్లింల ఆందోళన



జ్ఞానాపురం జోనల్ కార్యాలయం వద్ద సిటు నిరసన ప్రదర్శన

సిటు ఆధ్వర్యంలో నిరసన

అల్లిపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 పరిధిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. సిటు జోన్ సెక్రటరీ ఒ.అప్పారావు మాట్లాడుతూ కొన్నేళ్లగా కార్మికుల జీతాలు ఇప్పటికీ మంజూరు చేయడం లేదన్నారు. కార్మికుల పిల్లలకు ఆప్కాస్ ద్వారా తక్షణమే ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. 2021 నుంచి కొద్దిమంది కార్మికులకు జీతాలు, ఆరోగ్య భత్యాలు చెల్లించవలసిన బకాయిలు చెల్లించకపోతే జోనల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం జోనల్ కమిషనర్ బి.రాముకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎస్.శ్రావణ్ కుమార్, వి.మహేశ్వరి, ఎ. కంతల్లి, కె.బాలరాజు, ఎస్.పాపారావు, రమణమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో మహిళల వరల్డ్ కప్ క్రికెట్ ట్రోఫీ ప్రదర్శన



ట్రోఫీని ఆసక్తిగా తిలకిస్తున్న యువత

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా మహిళల ఐసీసీ ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీకి విశాఖ ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో ప్రచారంలో భాగంగా సోమవారం బీచ్‌రోడ్డులోని టీయు 142 వద్ద ట్రోఫీని ప్రదర్శనకు ఉంచారు. సెప్టెంబరు 30 నుంచి జరగనున్న వుమెన్ వరల్డ్ కప్ క్రికెట్ టోర్నీలో ఐదు మ్యాచ్‌లకు విశాఖ కూడా ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ట్రోఫీ ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. బీచ్ రోడ్డు సందర్శనకు వచ్చిన యువతీ యువకులు వరల్డ్ కప్ ట్రోఫీ వద్ద ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు. వరల్డ్ కప్ ట్రోఫీని తొలిసారిగా నేరుగా చూసే అవకాశం కలగడంతో సందర్శకులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్తర నియోజకవర్గంలో పి-4 కార్యాలయం



మాధవధారలోని పూర్వ మీసేవ కేంద్రం లోపల చేపడుతున్న పనులు

మాధవధార, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పి-4 ప్రాజెక్టు విశాఖ ఉత్తర నియోజకవర్గ కార్యాలయం రూపుదిద్దుకుంటోంది. జీవీఎంసీ 51వవార్డు మాధవధార ఆర్టీపీ కార్యాలయం సమీపంలోని పాత మీసేవ కార్యాలయాన్ని ఇందుకోసం కేటాయించారు. జగన్ ప్రభుత్వంలో మూతపడిన మీ సేవ కార్యాలయమిది. సువిశాలమైన ఈ కార్యాలయంలోనే ఇపుడు నవీకరణ చేపట్టి రెండు గదులు, కాన్ఫరెన్స్ హాలు ఏర్పాటు చేస్తున్నారు. పాత కరెంట్ వైరింగ్ పూర్తిగా దెబ్బతినడంతో వాటి స్థానంలో కొత్త ఎలక్ట్రికల్ పనులు చేయిస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశం మేరకు విభజన పనులు, మరుగుదొడ్ల నిర్మాణం జోరందుకుంది. కొత్త ఫర్నీచర్ రానుంది. ఈ పనులకు రూ.16 లక్షలు కేటాయించారు. ఇంజనీరింగ్ విభాగం ఈ పనులను పర్యవేక్షిస్తోంది. మీసేవలో పనిచేసిన అప్పటి ఉద్యోగులకు కాంట్రాక్టు ప్రాతిపదికన మళ్లీ అవకాశం కల్పించారు. సిబ్బంది కేటాయింపు: కొత్త పి-4 కార్యాలయంలో 17 వార్డులకు చెందిన ప్రజలకు ఇకపై ఇక్కడి నుంచే సేవలు అందిస్తారు. సబ్ కలెక్టర్, నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మౌలిక సదుపాయాలతో పాటు, కంప్యూటర్ సిస్టమ్స్, కాన్ఫరెన్స్ హాలు వగైరాలతో కొత్త కార్యాలయం ముస్తాబు కానుంది. వారం రోజుల్లోనే ప్రజలకు ఈ కార్యాలయం నుంచి సేవలు ఆరంభమయ్యేలా వేగంగా పనులు చేపడుతున్నారు.

అప్రంటీస్ మేళాకు స్పందన



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న ఆర్డీడీ ఆర్.వి.రమణ, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తదితరులు

కంచరపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధాని అప్రంటీస్ మేళాకు అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించింది. నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 510 మంది ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు పాల్గొన్నారు. ఐటీఐల రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ మేళాలో ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్థాన్ షిప్‌యార్డు, ఆల్ ఇండియా రేడియో, విశాఖ స్టీల్ ప్లాంట్ తదితర ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు కంపెనీలు పాల్గొని యువతకు మౌఖిక పరీక్షలు నిర్వహించాయి. అప్రంటీస్ షిప్ శిక్షణకు ప్రాథమికంగా 348 మందిని ఎంపిక చేసినట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్రావు, అప్రంటీస్ సలహాదారు యూఎస్ఎన్ మూర్తి, ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వార్డు అధ్యక్షుల నియామకం



సంగు వాసు
49వ వార్డు

మురళీనగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి); విశాఖ ఉత్తరంలోని 49వ వార్డు బర్మాక్యాంప్ ప్రాంతానికి తెలుగుదేశం నూతన అధ్యక్షునిగా పార్టీ యువనాయకుడు సంగు వాసుని నియమించారు. పార్టీ అధిష్ఠానం నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్న వాసును సీనియరు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు సోమవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో కొత్త అధ్యక్షుడు సంగు వాసు మాట్లాడుతూ విశాఖ ఎంపీ శ్రీభరత్, నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, పార్టీ నగర అధ్యక్షుడు జి.బాబ్జీలకు ధన్యవాదాలు తెలిపారు. కొత్త అధ్యక్షునిగా వార్డులో తన మార్కుతో పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకముంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానని వాసు పేర్కొన్నారు.

43వ వార్డుకు బొడ్డేటి శ్రీదేవి



అక్కయ్యపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 43వ వార్డు టీడీపీ అధ్యక్షురాలిగా బొడ్డేటి శ్రీదేవి నియమితులయ్యారు. ఆమెకు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జి, ఎంపీ శ్రీభరత్ నియమాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయిని సన్మానం

భీమునిపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భీమిలిలోని పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ హెచ్ఎం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని సోమవారం ఆ పాఠశాలలో కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఘనంగా సత్కరించారు. శ్రీదేవి జాతీయ అవార్డు పొందడం పాఠశాలకు, భీమిలి పట్టణానికి ఎంతో గర్వకారణమన్నారు నిర్వాహకులు ఉపాధ్యాయిని శ్రీదేవిని ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న దీపిక, ఉష్మశ్రీ, శ్రీదేవి తదితరులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు శ్రీనివాస నగర్‌లో రూ.1.7 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉష్మశ్రీ, టీడీపీ, బీజేపీ వార్డు అధ్యక్షులు బొడ్డేటి శ్రీదేవి, నాగమంత్రి రఘునాథ్, బొడ్డేటి మోహన్, జోనల్ కమినర్ రాము పాల్గొన్నారు.

అసెంబ్లీలో చర్చించి ఆటో కార్మికులకు న్యాయం చేయిస్తా

» ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హామీ



వినతిపత్రం పరిశీలిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఆటో డ్రైవర్ల సమస్యలపై చర్చించి న్యాయం చేయిస్తామని ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు హామీ ఇచ్చారు. తమకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ సోమవారం ఆటో కార్మికులు విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేయగా పరిశీలించిన ఆయన పైవిధంగా హామీ ఇచ్చారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే వద్దకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ప్రతినిధులు వెళ్లి కలిశారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, టాటా మ్యాజిక్ బ్యాంక్ మేనేజర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యు.శివాజీ, కె.దేవుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల హక్కులు పరిరక్షించాలి

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించి, వారి హక్కులను పరిరక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో లక్ష్మీ కనకదుర్గా ఆటో కార్మికుల సంక్షేమ సేవా సంఘం సీఐటీయూ అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కుమార్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేరళలో మాదిరి మన రాష్ట్రంలోనూ ఆటో కార్మికులకు, డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు వులవల బాబ్జీరావు, కార్యదర్శి జామి సాంబమూర్తి, కోశాధికారి పూడిపెద్ది కామేశ్వరరావు, అతిథులు చేతుల మీదుగా ఈ ఏడాదిలో మృతి చెందిన ఆటో డ్రైవర్లు నలుగురు కుటుంబాలకు రూ.10 వేలు చొప్పున అందచేశారు. సంఘంలో సభ్యులైన వారి కుమార్తెలు వివాహం చేయడంతో ఆరుగురికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు యూఎస్ఎన్ రాజు, ఆర్ఎస్ మాధవి, బలివాడ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆంధ్ర వైద్య కళాశాలలో టీవోటీ శిక్షణ

మహారాణిపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారిని ముందుగా గుర్తించడం ద్వారా దీని విస్తరణకు అడ్డుకట్ట వేయొచ్చని భావిస్తూ ఆంధ్ర వైద్య కళాశాలలో జిల్లా స్థాయి టీవోటీ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. క్యాన్సర్ ముందస్తు గుర్తింపు కోసం చేపట్టిన నిఖిల్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలకు శిక్షణ ఇస్తున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్యాధికారి డా.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మహిళలకు రొమ్ము, సర్వేకల్. ఓరల్ క్యాన్సర్‌లను గుర్తించే నైపుణ్యాన్ని పెంచుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్ల దాటిన మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేయటం ద్వారా ప్రారంభ దశలోనే క్యాన్సర్ వ్యాధిని గుర్తించవచ్చన్నారు. ఎన్‌సీడీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

డిసెంబరు 31 నుంచి సీఐటీయూ మహాసభలు

తగరపువలస, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలను డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్టు సీటూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. జగ్గునాయుడు తెలిపారు. సోమవారం చిట్టివలసలోని కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు దేశం నలుమూలల నుంచి ఎంతోమంది హాజరవుతారని చెప్పారు. సభల్లో భాగంగా నగరంలో భారీ బహిరంగ సభ, ర్యాలీ ఉంటాయని తెలిపారు. కార్మికులంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చికిత్సల కోసం పిల్లల తరలింపునకు ఉచిత వాహనం ప్రారంభం

సీతంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదేళ్లలోపు పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి చికిత్సల నిమిత్తం ఉపయోగించేందుకు ఆర్‌బీఎస్‌కే వాహనాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో వైకల్యాన్ని తగ్గించడానికి అంగన్వాడీ కేంద్రాలు, సామాజిక, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి కేజీహెచ్‌లో గల డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు రిఫర్ చేయాలన్నారు. ముఖ్యంగా జనన సమయంలో ఇబ్బందులను వైద్యాధికారులు గుర్తించి ఉచిత సలహా, చికిత్సల కోసం ఈ ప్రత్యేక వాహనంలో తరలిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ హరిక, బి.నాగేశ్వరరావు, డాక్టర్ కె.అప్పారావు, ఎన్టీఆర్ వైద్య సేవ ప్రతినిధి శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోను కొనసాగించాలి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ ప్రతినిధులు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌సిటీ డిపోను అక్కడే కొనసాగించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, కోశాధికారి వీవీవీ మోహన్, రీజనల్ కార్యదర్శి శంకరరావు విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన క్యార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్టీల్‌సిటీ డిపోను ఖాళీ చేయాలని ఉక్కు యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులపై ఎన్ఎంయూఏ రాష్ట్రకమిటీ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి సమస్యను వివరించామన్నారు. డిపో అక్కడే కొనసాగే విధంగా జిల్లా అభివృద్ధి మండలి సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ వాల్తేరు డిపో అధ్యక్షుడు పీజీ పతి, కార్యదర్శి ఆర్.వసంతరావు, జిల్లాలోని అన్ని డిపోల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

గీతం వర్సిటీలో 'తెలుగు టైటాన్స్' సందడి



వర్సిటీలో తెలుగు టైటాన్స్ కబడ్డీ క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12 టోర్నీ ప్రచారంలో ఆతిథ్య తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు సోమవారం గీతం యూనివర్సిటీలో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గేమ్స్, క్విజ్ పోటీల్లో విద్యార్థులతో పాటు పాల్గొని ఉత్సాహపరిచారు. అనంతరం తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్‌మాలిక్ మాట్లాడుతూ కబడ్డీ తన జీవితాన్ని మార్చిందని, చిన్న గ్రామం నుంచి తనను ప్రపంచానికి పరిచయం చేయడమే కాకుండా అన్ని రకాలుగా తన కుటుంబానికి అండగా నిలబడగలిగే శక్తినిఇచ్చిందని చెప్పారు. అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ప్రపంచ స్థాయి వేదికపైకి చేరుకోగలమని తెలిపారు. దేశంలో ప్రతిభ గల కబడ్డీ క్రీడాకారులకే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లకు పీకేఎల్ అద్భుతమైన ప్లాట్‌ఫామ్‌గా నిలిచిందన్నారు. అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ప్రపంచ స్థాయి వేదికపైకి చేరుకోగలమని తెలిపారు. అనంతరం ఆటగాళ్లు ఆటోగ్రాఫ్ చేసిన టీషర్టును గీతం అసిస్టెంట్ డీన్ అరుణ్ కార్తీక్, ప్రసాదరావు, టైటాన్స్ ఆటగాళ్లు ఆవిష్కరించారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దు: సీపీఎం



కంచరపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని కంచరపాలెం జోన్ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయవద్దని, ఈవోఐను తక్షణమే రద్దు చేయాలనే నినాదాలతో జీవీఎంసీ 54, 55, 56 వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సర్వనాశనం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈవోఐను రద్దు చేసి తొలగించిన 5 వేల మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ దిశగా తీసుకుంటున్న నిర్ణయాలను నిరసిస్తూ ఈ నెల 11న గాజువాకలో చేపట్టనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ప్లకార్డులతో కరపత్రాలు పంపిణీ చేస్తూ నిరసనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, కార్యవర్గ సభ్యులు బి. పద్మ, ఒమ్మి అప్పారావు, ఈశ్వర్రావు, సోమేశ్వర్రావు, శ్రీనివాస్, గంగరాజు పాల్గొన్నారు.

కుండపోత వర్షంతో ఇబ్బందులు



బురదగా మాధవధార అంబేడ్కర్ కాలనీ రోడ్డు

మాధవధార, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) ; మాధవధార, మురళీనగర్ ప్రాంతాల్లో సోమవారం జోరువాన కురియడంతో నివాసిత ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వర్షం సాయంత్రానికి కుండపోతగా మారడంతో జనం రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. విద్యాసంస్థలు, కార్యాలయాల నుంచి ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యే సమయంలో భారీ వర్షంతో రోడ్లు జలమయం కావడంతో అనేక అవస్థలు పడ్డారు. మాధవధార 51వ వార్డు అంబేడ్కర్‌కాలనీ రోడ్డులో ఇటీవల ఆరంభించిన భూగర్భ విద్యుత్ కేబుళ్ల అమరిక పనుల కోసం రోడ్డు తవ్వి పనులు జరుపుతున్నారు. దీంతో తవ్వకాల గోతుల్లో నీరు నిండి రోడ్డంతా చిందరవందరగా మారింది. రోడ్డంతా పేరుకుపోయిన ఎర్రమట్టి బురద నీటిలో పాదచారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైవే బిర్లాజంక్షన్ పాస్‌పోర్టు కార్యాలయం ఎదుట సర్వీసు రోడ్డులో నిలిచిపోతున్న వాన నీటితో తారు రోడ్డు నామరూపాల్లేకుండా తయారైంది. గోతుల్లో చేరుతున్న నీటితో వాహనదారులు ప్రమాదాలను దాటుకుంటూ రాకపోకలు సాగించారు.

నేత్రదానాన్ని ప్రోత్సహించడం అభినందనీయం

» నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి

సీతంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేత్రదాన ఆవశ్యకతపై అవగాహన కల్పించడం, నేత్రదానం చేయడానికి పలువురు ముందుకు వచ్చేలా ప్రోత్సహించడం అభినందనీయమని ల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు కొనియాడారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఐ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 25 నుంచి నిర్వహిస్తున్న 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ముగిశాయి. సోమవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ 15 రోజులుగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి పర్యవేక్షణలో నేత్రదానానికి ప్రేరేపించి ఫలితాలు సాధించడం ప్రశంసనీయమని ఇద్దరినీ కొనియాడారు. డాక్టర్ వి.మీనాక్షి మాట్లాడుతూ నేత్రదానం ఆవశ్యకతను తెలుపుతూ ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీల నిర్వహణ ద్వారా సత్ఫలితాలు సాధించామన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అధికారులు ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ లక్ష్మి, ఐ బ్యాంక్ మేనేజర్ అభినీత్, ఆప్తాల్మిక్ ఆఫీసర్‌లు ఉమా శ్రీనివాస్, ఆర్.సురేష్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది, ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు, ఎల్‌వి ప్రసాద్ ఐ ఆసుపత్రి, మోహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో ప్రతిభ చూపిన బాలికకు ప్రశంసాపత్రం అందచేస్తున్న డాక్టర్ పి.జగదీశ్వరరావు, డాక్టర్ వి.మీనాక్షి

13 నుంచి జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 13, 14 తేదీలలో జిల్లా స్థాయి డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు స్కూల్ ఆఫ్ థియేటర్స్ ఆర్ట్స్ డైరెక్టర్ ఆర్.జానకి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంటీసీ కాలనీలోని వెంకటేశ్వర గుడి ఎదురుగా ఉన్న ఏపీఎస్ఈబీ కాలనీ సమావేశ మందిరంలో 13న ఉదయం 10 గంటల నుంచి ఈ పోటీలు శాస్త్రీయ, జానపద సోలో డ్యూయెట్ అంశాల్లో జరుగుతాయన్నారు. 13 ఏళ్లలోపు వారిని జూనియర్స్ గాను, 14 నుంచి 18 ఏళ్ల లోపు వారిని సీనియర్స్ గానూ పోటీల్లో పరిగణి స్తామన్నారు. రెండు విభాగాల్లోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. పాల్గొన్న ప్రతీ నృత్య కళాకారునికి ప్రశంసా పత్రాలు అందిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే కళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శన అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల నృత్య కళాకారులు ఈ నెల 11లోపు ఫోన్ నెంబరు (85229 90123)లో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని జానకి ఆ ప్రకటన ద్వారా తెలియజేశారు.

గ్రేటర్‌లో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

పనులు ఎంతవరకు జరిగాయి? ఏస్థాయిలో ఉన్నాయనేది తెలుసుకోవాల్సి వస్తోంది. అదే ప్రధాన కార్యాలయంలో అన్ని జోన్‌ల డీబీలు ఉంటే ఒకచోట సమాచారం తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని కొందరు కాంట్రాక్టర్లు భావించారు. అనుకున్నదే తడవుగా తమ ప్రతిపాదనను జీవీఎంసీ ఉన్నతాధికారుల ముందుంచారు. అప్పటికే ప్రధాన కార్యాలయం నుంచి జోనల్ కార్యాలయాలకు డీబీలు తరలించి, వాటికి మౌలిక వసతుల కోసం రూ.లక్షలు వ్యయం చేశామని వివరించి, కాంట్రాక్టర్ల ప్రతిపాదనను తిరస్కరించాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఆశ్చర్యానికి గురిచేసింది. జోనల్ కార్యాలయల్లో డీబీల కోసం చేసిన ఖర్చు విషయాన్ని మరిచిపోయి, తక్షణం డీబీలను ప్రధాన కార్యాలయానికి తీసుకురావాలంటూ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరాజు ఇటీవల ఆదేశాలు జారీచేశారు. అధికారుల ఆదేశాలను జీవీఎంసీలోని ఇంజనీరింగ్ అధికారులే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కాంట్రాక్టర్లతో వ్యక్తిగత సంబంధాలు కారణంగానే అధికారులు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తుండడం గమనార్హం.

టీడీఆర్ హబ్‌లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఫీజులు వసూలు ప్రక్రియ నిర్వహించారు. థీసెస్‌ను యూనివర్సిటీ సెక్షన్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆధ్వర్యంలో సబ్మిట్ చేసేలా చూడాలి. కానీ, చాలామంది నేరుగా టీడీఆర్ హబ్‌లోనే సమర్పించారు. నిబంధనలను పూర్తిగా విస్మరించి అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడినట్టు అధికారులు గుర్తించినట్టు తెలిసింది. మరి అందుకు బాధ్యులైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చూడాలి. ప్రవేశాలు పొందిన వారిలో కొందరికి ఇప్పటికే పీహెచ్‌డీలను మంజూరుచేయగా, మరికొందరివి పెండింగ్‌లో ఉన్నాయి. వారంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలు పొంది ఇప్పటికీ పీహెచ్‌డీ పట్టా తీసుకోని వారికి అన్యాయం జరగకుండా, న్యాయపరమైన చిక్కులు భవిష్యత్తులో ఎదురుకాకుండా సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

లేఅవుట్లపై పెత్తనం!

... 5వ పేజీ తరువాయి

ప్రజాప్రతినిధి కూడా జోక్యం చేసుకుని కొన్ని లేఅవుట్‌లను తాను చెప్పిన వ్యక్తులకు ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో అధికారులు ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికే పనులు చేస్తున్న కాంట్రాక్టరును ఎందుకు తప్పించాలని అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది నుంచి సంస్థ కార్యకలాపాలపై జోక్యం చేసుకుంటున్న మరో నేత పీఏ ఒకరు ఇటీవల మళ్లీ పైరవీలు చేస్తున్నారు. గతంలో హౌసింగ్‌లో పనిచేసి రిటైరైన తరువాత పీఏగా చేరిన ఆ వ్యక్తి, హౌసింగ్ విభాగంపై పెత్తనం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా కిందిస్థాయిలో పనిచేసే ఇద్దరు అధికారుల అవినీతి వ్యవహారం సంస్థకు తలనొప్పిగా పరిణమించింది. మందకొడిగా పనులు చేసే సంస్థలను నిర్మాణ బాధ్యతల నుంచి తప్పిస్తామని పైస్థాయి అధికారులు హెచ్చరికలు చేయగా, కిందిస్థాయి అధికారులు వారికి అభయం ఇస్తున్నారు.

స్టీల్ ప్లాంటులో శ్రమ దోపిడీ!

» రోజువారి కార్మికుడికి రూ.400, మధ్యవర్తికి రూ.200

» ఉక్కు ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ విజ్ఞప్తి



ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్లాంటులో ఇటీవల కాలంలో వందలాది మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల కొరత చాలా ఎక్కువగా ఉంది. దీంతో ఆయా విభాగాలకు చెందిన కాంట్రాకర్లు బయట నుంచి కొంతమంది కార్మికులను రోజువారి కూలీకి తీసుకువచ్చి పనులు చేయిస్తున్నారు. కాగా ఉక్కు కర్మాగారంలో స్కిల్డ్, అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులుగా విభజించి వేతనాలు చెల్లించేవారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రోజువారి పద్ధతిలో బయట నుంచి కూలీలను తీసుకువచ్చి కాంట్రాక్టర్లు పనులు చేయిస్తున్నారు. ఇందుకోసం రోజుకు ఆరు వందల రూపాయలను ఒక్కో కార్మికుడికి ఇస్తున్నామని ఉక్కు అధికారులకు కాంట్రాక్టర్లు చెబుతున్నట్టు సమాచారం. అయితే సదరు కూలీలకు కేవలం రూ.నాలుగు వందలు మాత్రమే ఇచ్చి మిగతాది మధ్యవర్తులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది కూలీలు కూడా తమకు కేవలం రూ.400 మాత్రమే ఇస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నారు.

ఇదిలావుండగా ప్లాంటులోని విభాగాల్లో అనుభవం కలిగిన కాంట్రాక్టు కార్మికులను తొలగించి ఏమాత్రం అనుభవం లేని కార్మికులను బయట నుంచి తీసుకురావడం వల్ల కర్మాగారంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాంట్రాక్టు కార్మిక సంఘం (ఇంటక్) అధ్యక్షుడు కె.వంశీకృష్ణ పేర్కొన్నారు. అనుభవం లేని కార్మికులను ప్లాంటులోకి అనుమతించరాదని, దీనివల్ల కార్మికుల భద్రతతో పాటు కర్మాగారానికి ఇబ్బందులు వస్తాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'సూపర్ సిక్స్-సూపర్ హిట్'ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

» టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్. సూపర్ హిట్ అన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కూటమి కార్యకర్తలతో పాటు సచివాలయ సిబ్బందిపై ఉందని టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. వార్డు పరిధి మాతృశ్రీనగర్‌లో టీడీపీ కార్యాలయంలో సోమవారం సచివాలయ సిబ్బంది, ప్రజలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 15 నెలల్లో చేసిన మంచిని, సంక్షేమాన్ని, అభివృద్ధి పనులను వార్డులోని ప్రజలందరికీ తెలియజేయాలని కార్యకర్తలు, సచివాలయ సిబ్బందిని కోరారు. ఈ సందర్భంగా వార్డులోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలని నల్లూరు సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా మారిందని, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నారన్నారు. సమావేశంలో కూటమి నాయకులు కాదా శ్రీను, ఎం.గణపతి, వేగుంట శ్రీనివాస్, కె.రమేశ్, బి.జగదీశ్, త్రినాథ్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.


సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తున్న కార్మికులు

జీతాల కోసం సినర్జీస్ కార్మికుల ధర్నా

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత ఏడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ సినర్జీస్ కార్మికులు సోమవారం వీఎస్ఈజడ్ రహదారిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ ఏడు నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకపోతే వారు కుటుంబాలతో ఎలా జీవనం సాగిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుసౌకర్యాలను నిలిపివేయడం, కార్మికుల నుంచి వసూలు చేసిన పీఎఫ్‌లను కట్టకుండా కాలయాపన చేయడం, కార్మికుల మౌలిక సదుపాయాలపై శ్రద్ధ చూపకపోవడం దారుణమన్నారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని నినాదాలు చేశారు.

భారీ వర్షం: లోతట్టు ప్రాంతాలు జలమయం


జగ్గు జంక్షన్ మార్గంలో నిలిచిన వర్షపు నీరు

గాజువాక, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గాజువాకలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఆ తరువాత 3 గంటల సమయంలో జోరువాన పడడంతో వాతావరణం చల్లబడింది. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది.

రోగి కోలుకోవడంలో ఫిజియోథెరపీ పాత్ర కీలకం

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏదైనా ప్రమాదం జరిగితే రోగి కోలుకునేందుకు శస్త్ర చికిత్స ఎంత అవసరమో.. ఆ తరువాత ఫిజియోథెరపీ కూడా అంతే ముఖ్యమని ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అపర్ణ అన్నారు. అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్, స్పాండిలైటిస్ వంటి వాటితో పాటు ట్రామా, కార్డియో, న్యూరో విభాగాల్లో కూడా ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎమ్‌హెచ్‌వో అప్పలనాయుడు

పీజీఆర్ఎస్‌కు 19 ఫిర్యాదులు

వేపగుంట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 19 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా ఎల్లపువానిపాలెంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని ఆపాలని, 93వ వార్డు శ్రీనివాసనగర్‌లో పశువులను దారికి అడ్డంగా కట్టడం వల్ల రాకపోకటకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, 94వ వార్డు కృష్ణానగర్‌లో రోడ్డు ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని, 95వ వార్డు చిమలాపల్లిలో రోడ్డు వెడల్పులో రహదారి కోల్పోయిన తమకు నష్టపరిహారం చెల్లించాలని, మరిడిమాంబ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, 97వ వార్డు చినముషిడివాడలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపించి చర్యలు చేపట్టడం జరుగుతుందని ఏఎమ్‌హెచ్‌వో బండారు అప్పలనాయుడు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పాన్ షాపు దగ్ధం


దగ్ధమైన దుకాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్ కాలనీలోని కామధేను వరలక్ష్మీ పాన్‌షాప్‌లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి షార్ట్ సర్క్యూట్ అయ్యి దుకాణం దగ్ధమయింది. ఈ విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకుని, ప్రభుత్వ పరంగా సహకారం అందేలా చూస్తానని బాధిత మహిళకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కుండపోత

» జలమయమైన ప్రధాన రహదారి

» వర్షపునీరు ప్రవాహానికి కూలిన జడ్పీ హైస్కూల్ ప్రహరీ


కూలిపోయిన గోపాలపట్నం జడ్పీ హైస్కూల్ ప్రహరీ


ఎన్ఏడీ ప్రధాన రహదారి పక్కన నిలిచిన వర్షపునీరు

ఎన్.ఎ.డి.జంక్షన్/వేపగుంట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి 90వ వార్డు పరిసర ప్రాంతాల్లో అనేక చోట్ల నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా వెంకటసాయినగర్, అప్పలనర్సయ్య నగర్, మేహాద్రి గెడ్డకు వెళ్లే రహదారులపై వర్షపు నీరు ఎక్కువగా నిలిచిపోయింది. కృష్ణానగర్ గెడ్డలో భారీగా వర్షపు నీరు చేరింది. లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతంలో రాళ్లు దొర్లుకుంటూ ఇళ్ల ముందుకు వచ్చాయి. దీంతో స్థానికులు ఆందోళన చెందారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కొండవాలు ప్రాంతాల వాసులు వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కూలిన జడ్పీ హైస్కూల్ ప్రహరీ

గోపాలపట్నం, (ఆంధ్రజ్యోతి): సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి స్థానిక హెచ్‌సీ వెంకటాపురం జడ్పీ హైస్కూల్ ప్రహరీ కూలింది. వర్షపునీరు కొండవాలు ప్రాతంలో ఉధృతంగా ప్రవహస్తూ కొండదిగుతున పద్మనాభనగర్ కాలువలో కలుస్తుంది. ఇక్కడ టిడ్కో ఇళ్లను నిర్మించే సమయంలో కాలువలు నిర్మిచకపోవడంతో నీటి ప్రవాహం నేరుగా పాఠశాల ప్రహరీను తాకుతూ దిగువ ప్రాంతానికి చేరుతుంది. ప్రవాహం ఎక్కువ ఉండడంతో ప్రహరీ కొంతభాగం కూలిపోయింది. దీంతో వరద నీరు పాఠశాలలో ఉన్న వంటగదిలోకి చేరింది. అలాగే గ్రౌండ్‌లో ఉన్న ఓపెన్ జిమ్ చిత్తడిగా మారింది.

పొంగి పొర్లుతున్న గెడ్డలు

» ఇళ్లలోకి చేరుతున్న మురుగునీరు

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు


మారుతి సర్కిల్‌కు వెళ్లే మార్గంలో నిండిన గెడ్డ

మల్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ములగాడ గ్రామానికి సంబంధించిన ప్రధాన గెడ్డలు పూర్తిగా నిండిపోయాయి. ఏ క్షణంలో గెడ్డలోని నీరు గ్రామంలోకి వస్తుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు. కొంత కాలంగా ఈ గెడ్డల్లో పూడికలు తీయకపోవడంతో పరిసర ప్రాంతాలన్నీ కంపుకొడుతున్నాయి. వర్షం పడితే గెడ్డ నిండిపోయి ఆ మురుగునీరు గ్రామాలోకల వచ్చేస్తోంది. ములగాడ గ్రామం నుంచి మారుతి సర్కిల్ వరకు వెళ్లే మార్గంలో ఉన్న గెడ్డ పోర్టు గుండా వెళ్లింది. దీంతో పోర్టులో ఉన్న గెడ్డల ద్వారా ఈ గెడ్డలోని మురుగు నేరుగా సముద్రంలోకి వెళ్లి కలుస్తోంది. పోర్టు పరిధిలో ఉన్న గెడ్డలను శుభ్రం చేయాల్సిన బాధ్యత పోర్టుదే. కానీ పోర్టు యాజమాన్యం ఈ విషయంపై స్పందించకపోవడంతో వర్షం వస్తే గెడ్డలోని మురుగంతా పొంగిపొర్లుతోంది. పోర్టు పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను కోరమాండల్, శ్రావణ్ షిప్పింగ్ కార్పొరేషన్‌కు లీజుకు ఇచ్చారు. ఆ సంస్థలు వారికి కేటాయించిన స్థలాల్లో భారీ షెడ్లను నిర్మించారు. ఈ షెడ్ల నిర్మాణ సమయంలో వచ్చే వ్యర్థాలను ఈ గెడ్డలో పడేశారు. అంతేకాకుండా గెడ్డపై కొన్ని చోట్ల నిర్మాణాలు జరిగాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీని వల్లే గెడ్డలు నిండిపోయాయని పలువురు అంటున్నారు. గెడ్డలు నిండిపోవడంతో వర్షం పడితే శ్రీరామ్‌నగర్, ములగాడలోని ఇళ్లలోకి మురుగునీరు వచ్చేస్తోంది. ఇప్పటికైన పోర్టు, జీవీఎంసీ అధికారులు స్పందించి గెడ్డలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

'రిజిస్ట్రేషన్ పేరుతో ఇంటి ఒరిజినల్ పట్టాలు తీసుకోవడం దారుణం'

మల్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి తహశీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారుడు నుంచి ఒరిజినల్ పట్టా తీసుకోవడం, రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత పత్రం ఇవ్వకపోవడం దారుణమని వైసీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజవర్గం వైసీపీ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ సూచన మేరకు 59వ వార్డు వైసీపీ అధ్యక్షుడు రేవల సత్యనారాయణ సోమవారం ఉదయం ములగాడ తహశీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుడు నుంచి ఒరిజినల్ పట్టా కాకుండా జెరాక్సు తీసుకోవాలని, ఒక వేళ తీసుకుంటే ఫలానా లబ్ధిదారుడు నుంచి ఒరిజినల్ పట్టా తీసుకున్నట్టు ఎకనాల్జెమెంట్ అయినా ఇవ్వాలని తహశీల్దార్‌ను కోరారు. ఏ లబ్ధిదారుడుకు అన్యాయం జరగదని, ఒరిజినల్ పట్టా తీసుకున్న అది తమ దగ్గరే ఉంటుందని, రిజిస్ట్రేషన్ జరిగిన తరువాత పత్రాలతో తమ దగ్గరున్న పట్టాను లబ్ధిదారుడికి అందజేస్తామని తహశీల్దార్ రమేశ్ నాయుడు వివరించారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

అగనంపూడి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం విజన్ కేర్ ఆధ్వర్యంలో ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 149 మంది విద్యార్థులకు డాక్టర్ శివకుమార్ ఆధ్వ ర్యంలో నేత్ర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హనుమంతరావు, కేజే నాయుడు, బి.సత్యనారాయణ, బి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు దసరా బోనస్ రూ.23,500

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్) ఉద్యోగులకు దసరా బోనస్‌గా 23,500 రూపాయలను యాజమాన్యం ప్రకటించినట్టు స్టీల్ ప్లాంట్ ఎఫ్ఎస్ఎన్ఎల్ గుర్తింపు యూనియన్ గౌరవ అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం రూ.50 వేలను దసరా బోనస్‌గా ఇవ్వాలని తాము యాజమాన్యాన్ని కోరామని, అయితే సంస్థ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రూ.23500తో పాటు ఉద్యోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు యాజమాన్యం అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు.

కంప్యూటర్ లిటరసీపై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సీఎస్ఈ విభాగం విద్యార్థులు కణితి జడ్పీ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ లిటరసీపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ సన్యాసిరావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం ఇంటర్నెట్ వినియోగం, సాఫ్ట్‌వేర్ల వాడకం, వంటి అంశాలపై శిక్షణనిచ్చేందుకు విజ్ఞాన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన యువకుడి అరెస్టు

గోపాలపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకుల మధ్య జరిగిన వివాదం కొట్లాటకు దారితీసింది. దీంతో ఒక యువకుడిపై మరొక యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన లక్ష్మీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీనగర్‌కు చెందిన మణికంఠ అలియాస్ మస్తాన్(30) కంచరపాలెంలోని ఓ మటన్ షాపులో పనిచేస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన మనోజ్(27) ప్రైవేటు పనులు చేస్తుంటాడు. వీరిద్దరికి ఆదివారం రాత్రి గొడవ జరిగింది. అయితే ఈ గొడవ సద్దుమణగకపోవడంతో సోమవారం ఉదయం కూడా గొడవ పడ్డారు. ఈ క్రమంలో మణికంఠ మనోజ్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ లెంక సన్యాశిరావు ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు కేసు నమోదు చేసి మణికంఠను రిమాండ్‌కు తరలించారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 24, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 18, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 38, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 70, బరబాటి 36, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	128
లైవ్ ధర	148
విత్ స్కిన్	266
స్కిన్‌లెస్	276


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

రిజిస్ట్రేషన్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోండి

టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్ 296 పట్టాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా జరుగుతుందని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ కోరారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీవో 296 ప్రకారం గాజువాక ప్రజలకు పట్టాలను అందజేశారని, కానీ ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పక్కన పెట్టేసిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మళ్లీ అదే జీవోను ప్రజలకు అందుబాటులో ఉంచిందన్నారు. అందువల్ల పట్టాదారులందరూ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు తమరి శివప్రసాద్, వెంకటరావు, అంగ కృష్ణ, నమ్మి అప్పారావు, శంకరరావు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూబీఐ విజిలెన్స్ వారోత్సవాలు


ఆస్పత్రి ప్రాంగణంలో మొక్క నాటుతున్న యూబీఐ బీఎం సుధారాణి

అగనంపూడి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్థానిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ బ్రాంచి మేనేజర్ సుధారాణి మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 8,600 బ్రాంచిల ద్వారా ఖాతాదారులకు ఉన్నతమైన సేవలను అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రాంతీయ ఆస్పత్రిలో గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణతో కలిసి సుధారాణి వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైద్యులు సంతోషి, లలిత, రేష్మ, ఏవో రవిరాజు, ప్రజా సంఘాల నాయకులు రామకోటి, సత్యనారాయణ, హనుమంతరావు, లక్ష్మీప్రసన్న, మురళీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతో సమాజంలో మార్పు

పెదగంట్యాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యత శాతం పెరగడం వల్ల సమాజం ప్రగతి దిశగా ముందుకు సాగుతుందని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అక్షరాస్యతలో ముందున్న దేశాలు, రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉంటున్నాయని పేర్కొన్నారు. సంపూర్ణ అక్షరాస్యత దిశగా ప్రభుత్వం పలు పథకాలు, కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.మాధవి, కె.సూర్యకుమారి, శాఖా గ్రంథాలయాధికారి వీవీ రమణ తదితరులు, పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

పెందుర్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా ఆస్తిహక్కు కల్పించామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. చినముషిడివాడలో ఉన్న పెందుర్తి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పంచకర్ల సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలను అందజేశారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకట అప్పారావు, సబ్ రిజిస్ట్రార్ కీర్తన, తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, పిడుగుల వల్లే ఈఐపీఎల్‌లో ప్రమాదం

» పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు



మల్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నివేదిక ప్రకారం ఈస్ట్ ఇండియా పెట్రోలియం లిమిటెడ్ (ఈఐపీఎల్)లో జరిగిన అగ్నిప్రమాదానికి పిడుగులు, ఉరుములే కారణమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు స్పష్టం చేశారు. ఈఐపీఎల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై సోమవారం ఆయన మాట్లాడారు. ట్యాంక్‌లో మెతనాల్ అవశేషాలుపై పిడుగు పడడం వల్ల మంటలు చెలరేగి ఉండొచ్చని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో స్పందించి కంపెనీలో అన్ని భద్రత, జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కంపెనీకు సూచించారని తెలిపారు. ఆయిల్, ఫార్మా, స్టీల్‌ప్లాంట్లలో తరచుగా జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు 'ఓఐఎస్‌డీ గైడ్‌లైన్స్ 180' భద్రతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. ట్యాంకర్ల చుట్టూ 20 మీటర్ల దూరంలో లైట్నింగ్ ప్రొటెక్షన్ రాడ్లను ఏర్పాటు చేయాలని, కనీసం 30 మీటర్ల దూరంలో ఎర్తింగ్ గ్రౌండ్ టెర్మినల్స్ ఏర్పాటు చేసి ఉరుములు, మెరుపులు తాకకుండా రక్షణను కల్పించాలని అన్నారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా డిజాస్టర్ రెస్పాన్స్‌న ప్రణాళికలను అమలు చేయాలని తెలిపారు. ప్రమాద సూచనలు పాటించకపోతే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు.

విశాఖ ఇంజనీరింగ్ కళాశాల ఆక్రమణలపై చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోపాలపట్నం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక నరవ గ్రామంలో విశాఖ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తూ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కళాశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై 'దర్జాగా కబ్జా' పేరుతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించి కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణాన్ని స్థానిక వీఆర్‌వో విజయ పరిశీలించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కళాశాల యాజమాన్యానికి నోటీసులు ఇవ్వడానికి ఉన్నతాధికారులు ఆదేశించినట్టు ఆమె తెలిపారు. అదే విధంగా అక్రమ నిర్మాణం చేపడుతున్న ప్రాంతంలో సర్వే చేసి తగు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు

ఆలయాల్లో సంప్రోక్షణ

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం మూసి వేసిన బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల శ్రీవేంకటేశ్వర వినాయక దేవస్థానం, షీలా నగర్ ఎన్‌టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంతో పాటు పలు ఆలయాలను సోమవారం తెరిచి సంప్రోక్షణ గావించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫోబియా పరేషాన్



ఇటీవల పెరుగుతున్న బాధితుల సంఖ్య

30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారిలో అధికం

నిద్ర పట్టకపోవడం, గుండె దడ, భయం తదితర లక్షణాలు

కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, సోషల్ మీడియా వినియోగం, మెదడుపై అధిక ఒత్తిడే కారణం

సకాలంలో గుర్తిస్తే చెక్ చెప్పే అవకాశం

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి)

నిద్ర పట్టకపోవడం, గుండె దడ, పదిమందిలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారా.? అయితే మీరు ఫోబియాతో బాధపడుతున్నట్టే. కొన్నాళ్లుగా ఇలాంటి వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. 30 నుంచి 50 ఏళ్లలోపున్న వారిలో సమస్య అధికంగా కనిపిస్తోందని, నిర్లక్ష్యం వహిస్తే మానసిక సమస్యల బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ తరహా సమస్యతో బాధపడుతూ నగర పరిధిలోని మానసిక వైద్య నిపుణుల వద్దకు ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు రోగులు వస్తున్నారని, గతంలో నెలకు ఐదుకు మించి కేసులు వచ్చేవి కావంటున్నారు.

ఫోబియాను రెండు రకాలుగా చెబుతారు. ఏదైనా వస్తువు, జంతువులు, ఇతర అంశాల పట్ల కలిగే భయం వల్ల వచ్చే దానిని ఇండివిడ్యువల్ లేదా జూ ఫోబియా అంటారు. పదిమందిలోకి వెళ్లేందుకు భయపడినా, గుండె దడ, ప్రతిదానికీ ఆందోళన వంటి లక్షణాలుంటే క్లాస్ట్రో ఫోబియా అంటారు. ఈ ఫోబియాతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోందని, దీనికి అనేక అంశాలు కారణమంటున్నారు.

ఇవీ ప్రధాన లక్షణాలు

క్లాస్ట్రో ఫోబియాతో బాధపడే వారిలో నిద్ర పట్టకపోవ డం, గుండెదడ, భయం, ఆందోళన, యాంగ్జైటీ, రెస్ట్‌లెస్‌గా ఉండడం, ఊపిరి ఆడకపోవడం, బీపీ పెరుగుతుండడం వంటి లక్షణాలు ఉంటాయి. ఎక్కువ మందిలోకి వెళ్లినా, ఎవరితోనైనా మాట్లాడేందుకు ప్రయత్నించినా ఇటువంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. దీనికి అనేక అంశాలు కారణమని నిపుణులు చెబుతున్నారు. అధిక ఆలోచన, కుటుంబసమస్యలు, ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులు, మెదడుపై అధిక ఒత్తిడి. ఆత్మన్యూనతా భావం, సోషల్ మీడియాను అధికంగా వినియోగించడం వల్ల మెదడుకు విశ్రాంతి లేకుండా చేయడం సమస్య బారినపడేస్తుందంటున్నారు. కొందరిలో కుటుంబ నేపథ్యం కూడా కారణమంటున్నారు.

బయటపడే మార్గమేదీ.?

ఈ సమస్య నుంచి బయటపడేందుకు కొన్ని అంశాలు దోహదపడతాయి. యోగా, మెడిటేషన్, మ్యూజిక్ వినడం, మనసుకు ఉత్సాహాన్ని కలిగించే ఆటలాడడం, శారీరక శ్రమ, పుస్తకాలు చదవడం, కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపించడం వంటి అంశాలు ఉపకరిస్తాయి. కొన్ని సందర్భాల్లో మందులు, కౌన్సెలింగ్ అవసరమవుతుంది.



లక్షణాలను గుర్తించి అప్రమత్తం కావాలి



ఫోబియా లక్షణాలను గుర్తించి వెంటనే అప్రమత్తం కావాలి. కుటుంబ సభ్యులతో కలిసి మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి. గుండె దడ, నిద్ర పట్టకపోవడం, తీవ్రమైన ఆందోళన వల్ల ఇబ్బంది పడుతూ ఉంటారు. ఎవరికీ చెప్పుకోలేక, బయటకు రాలేక మదనపడుతుంటారు. వారికి వైద్యసహాయం అందించాలి. నిపుణుల సలహా మేరకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. లేదంటే తీవ్రమైన మానసిక సమస్యలకు కారణ మవుతుంది. కొన్నిసార్లు మ్యూజిక్ వినడం, మెడిటేషన్, యోగా ద్వారా సమస్య నుంచి బయటపడే వీలుంది.

– డాక్టర్ భాగ్యారావు, మానసిక వైద్య నిపుణులు

నేడు నగరానికి పూర్వ సీజేఐ

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ మంగళవారం నగరానికి రానున్నారు. ఉదయం 11గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని,హోటల్‌కు వెళతారు. సాయంత్రం ఐదుగంటలకు కళాభారతిలో జరిగే కొప్పరపు కవుల కళాపీఠం వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు కొప్పరపు కవుల జాతీయపురస్కారం ప్రదానం చేస్తారు. బుధవారం ఉదయం బయలుదేరి విమానంలో బెంగళూరు వెళతారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):కూర్మన్నపాలెంలోని ఎంవీవీ/ఎంకే పార్కు బిల్డర్స్ సంస్థ ప్రభుత్వ భూమి, శ్మశానం, రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. సర్వేనంబరు 60/5లో 500 మీటర్లు పొడవు, 45 మీటర్ల వెడల్పుతో ఉన్న శ్మశానం, సర్వే నంబరు 55లో 25 సెంట్ల ప్రభుత్వ ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నంబరు 58/3లో బఫర్‌జోన్‌లో సుమారు 1,626 చదరపు అడుగుల విస్తీర్ణంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టారని, సర్వేనంబరు 52/5సీలో గిఫ్ట్ ఇచ్చిన 1,237 చదరపు అడుగుల స్థలం ఆక్రమించుకున్నారని, ఇంకా 2,148 అడుగులకు టీడీఆర్ తీసుకున్నారన్నారు. దీనిపై గతంలో పలుమార్లు ఫిర్యాదుచేశామని, ముఖ్యమంత్రి, ఐటీ మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు అందజేశామని, చర్యలు తీసుకోవాలని కోరారు.

గెడ్డ ఆక్రమించి ఇళ్ల నిర్మాణం

ఆనందపురం మండలం రామవరం సర్వేనంబరు 11లో బలహీనవర్గాల కాలనీకి ఆనుకుని ప్రభుత్వ గెడ్డను ఆక్రమించుకుని పలువురు ఇళ్లు నిర్మించారని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఓ ప్రజాప్రతినిధి రెండతసుల భవనం నిర్మించారన్నారు. పంచాయతీ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇంటి నంబరు కేటాయించుకున్నారన్నారు.

జీవీఎంసీకి 105 వినతులు

వెంకోజీపాలెం: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 105 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. అర్జీలను సత్వరం పరిష్కరించాలని అధికారులను, జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి 23 కేజీల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సన్నీకుమార్ రామ్ (23), బిహార్‌కు చెందిన దిలీప్ సింగ్ (22)లు ఒడిశా నుంచి గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారిని కోర్టుకు తరలించారు.

దంచికొట్టిన వర్షం



జాతీయ రహదారిపై అక్కయ్యపాలెం వద్ద వర్షం

సింహాచలం/ గోపాలపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై సోమవారం కుండపో త వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుం చి సుమారు రెండు గంటల పాటు ఎడతెరపి లే కుండా వర్షం కురుస్తూనే ఉంది. కుండపోతగా కురిసిన వర్షంతో గోపాలపట్నం పరిసర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండవాలు ప్రాంతాల నుంచి వచ్చిన గెడ్డలు ఉధృతంగా ప్రవహించి కొత్తపాలెం గ్రామ శివారులోని లోతట్టు ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలను చేరాయి. వర్షం బీఆర్‌టీఎస్ రోడ్డుపై నీరు చేరింది. కొత్తపాలెం, చంద్రనగర్, పాత గోపాలపట్నం అండర్‌పాస్‌వేల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. దీంతో నగరవాసులు అవస్థలు పడ్డారు.



సింహగిరిపై భారీ వర్షం కురుస్తున్న దృశ్యం



గోపాలపట్నంలో జలమయమైన రహదారి



నగరంలో వర్షం కురుస్తున్న దృశ్యం

కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం 'మిరాయ్'

» సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో హీరో తేజా సజ్జల



సినిమా టికెట్ విడుదల చేస్తున్న హీరో తేజ, హీరోయిన్ రితికా, మనోజ్, తదితరులు

మహారాణిపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యాక్షన్, ఫాంటసీ, అడ్వంచర్స్‌తో కుటుంబసమేతంగా చూడదగ్గ సినిమా 'మిరాయ్' అని హీరో తేజా సజ్జల అన్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజా సజ్జల, రితికా నాయక్‌లు నాయకా, నాయికలుగా మంచు మనోజ్, శ్రియా, జగపతిబాబు ప్రధా న పాత్రల్లో ఏడు భాషల్లో ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న సినిమా ప్రీ రిలీజ్ వేడుక సాగరతీరంలో సోమవారం జరిగింది. బుల్లితెర వ్యాఖ్యాత సుమ సందడి చేసింది. మంచు మనోజ్, మౌనిక దంపతులు అభిమానులను అలరించారు, హీరో తేజా మాట్లాడుతూ మూడేళ్ల పాటు యూనిట్ కృషిచేశారని, నిర్మాత విశ్వప్రసాద్ మానసిక స్థైర్యాన్ని అందించారన్నారు.మంచి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. మంచు మనోజ్ మాట్లాడుతూ అందరి ఆశీస్సులు ఉన్నంత వరకు నాకు ఏమీ కాదనిన్నారు. మిరాయ్ చిత్రం కమ్ బ్యాక్ సినిమా అవుతుందని ఆశిస్తున్నానన్నారు. మహావీర్ లామా 2.2 బ్లాక్ స్వార్డ్‌గా మంచి క్యారెక్టర్ పోషించారన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ రితికా నాయక్, నిర్మాత విశ్వప్రసాద్, గంటా శారద, యూనిట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ వేగవంతం చేయండి

» రేషన్ డీలర్లకు జేసీ మయూర్ అశోక్ ఆదేశం



కార్డుల పంపిణీపై డీలర్లకు సూచనలిస్తున్న జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీని వేగవంతం చేయాలని రేషన్ డీలర్లను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. తన చాంబర్‌లో సోమవారం రేషన్ డీలర్ల సంఘ ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కొన్నిచోట్ల మందకొడిగా కార్డుల పంపిణీ చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. డీలర్లు పూర్తి బాధ్యత తీసుకుని పనిచేయాలన్నారు. జిల్లాలో 5,17,155 కార్డులకుగాను 3,46,955 (67.09 శాతం) పంపిణీ చేశారని, గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతానికిపైగా పూర్తికాగా నగరంలో మందకొడిగా సాగుతోందన్నారు. పోర్టబిలిటీ ద్వారా సరకులు పంపిణీ చేయాల్సిందేనని ఆదేశించారు. ప్రతి ఒక్కరికి కార్డు అందజేయాలని, సచివాలయం సిబ్బందితో సమన్వయంచేసుకోవాలన్నారు. సమీక్షలో జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్, ఏఎస్‌వోలు, చౌకడిపో డీలర్ల సంఘం అధ్యక్షుడు చిట్టిరాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపండి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

మహారాణిపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పథకం కారణంగా ఆదాయం కోల్పోయిన తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. విశాఖ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు వెంటనే విడుదల చేయాలని, ఆటోడ్రైవర్లకు పెట్రోలు, డీజిల్, గ్యాస్‌ను సబ్సిడీపై అందించాలని, మోటారు సవరణ చట్టం జీవో నెంబరు 21 రద్దుచేయాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్స్ జారీచేయాలని, ఓలా, రాపిడో తరహా యాప్‌లను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఆందోళన కార్యక్రమంలోపెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

5కే రన్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువతలో హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల మరింత అవగాహన కల్పిందుకు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, కలెక్టర్ ఆదేశాల మరకు ఇంటర్నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్‌లో 5కే రెడ్ రన్ పరుగు పందాలను సోమవారం నిర్వహించారు. జిల్లా క్రీడా విభాగం సహకారంతో రాక్ బీచ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ రోణంకి రమేశ్, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి వెంకటేశ్వరరావు మారథాన్‌ను ప్రారంభించారు. సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. బాలుర విభాగంలో మొదటి బహుమతి రూ.10 వేలను ప్రభుత్వ కృష్ణ కాలేజీ విద్యార్థి ఎంఎస్‌జే వేదవ్యాస్, రెండో బహుమతి రూ.7 వేలను సమత డిగ్రీ కాలేజీ విద్యార్థి సీహెచ్ సురేశ్ దక్కించుకున్నారు. బాలికల విభాగంలో ప్రథమ బహుమతి సమత డిగ్రీ కాలేజీ విద్యార్థిని డీవై దాక్షాయని, రెండో బహుమతి సెయింట్ ల్యూక్స్ కాలేజీ విద్యార్థిని అమూల్యమనికి లభించాయి. విజేతలను ప్రభుత్వ ఖర్చుతో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.

క్రైం... crime news

వివాహిత ఆత్మహత్య



హరిత మృతదేహం

పెందుర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న మీద ఒట్టేసి మద్యం మానేస్తానని కడియం వేసుకున్న భర్త మాట తప్పడంతో మనస్తాపం చెందిన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రహ్లాదపురం శ్రీనివాస నగర్‌కు చెందిన తోట హరిత (27)కు కాకినాడకు చెందిన బిరడా శ్రీనుతో మూడేళ్ల కిందట వివాహమయింది. పెళ్లికి ముందు నుంచి శ్రీను మద్యానికి బానిసయ్యాడు. దీంతో రెండు నెలల కిందట కాకినాడ నుంచి వచ్చి తన తల్లి నళిని ఉంటున్న ఇంటి సమీపంలోనే నివసిస్తున్నారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీను తాగుడు మానలేదు. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. నాలుగు రోజుల క్రితం సింహాచలం తీసుకువెళ్లి కడియం వేయించింది. రెండు రోజుల బాగానే ఉన్నా సోమవారం పూటుగా మద్యం సేవించి వచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో శ్రీను బయటకు వెళ్లాడు. తీవ్ర మనస్తాపానికి గురైన హరిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాను హుక్కుకు చున్నీ బిగించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా అప్పటికే మృతి చెందింది. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

బొడ్డపాలెంలో బాలిక ఆత్మహత్య

ఆనందపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బొడ్డపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం రాయగడ సమీపంలోని తాళాకేడ గ్రామానికి చెందిన బాలిక (13) రెండు నెలల క్రితం మండలంలోని బొడ్డపాలెం వచ్చి స్థానికంగా ఉన్న ప్లైవుడ్ కంపెనీల్లో ఉద్యోగ ప్రయత్నం చేసింది. ఆమె వయసు తక్కువడంతో ఎవరూ అనుమతించలేదు. ఇదిలాఉండగా ఆదివారం గ్రామంలోని గుడ్ల భూలోకరెడ్డి ఇంటికి వెళ్లి తన కుటుంబ సభ్యులు వస్తున్నారని, ఇల్లు అద్దెకు కావాలని కోరింది రాత్రి అక్కడే బస చేస్తాననడంతో యజమాని అనుమతించారు. రాత్రి బాలిక గదిలోపల గడియ పెట్టుకుని, ఫ్యాన్ హుక్‌కు తాడుతో ఉరివేసుకుంది. గమనించిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని తలుపులు పగలగొట్టి పరిశీలించారు. ఆమె కటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన వాసవానిపాలెంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చొక్కా పెద్దమ్మ, అప్పన్నలకు ఇద్దరు పిల్లలు. ఆదివారం చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం తొందరగా అన్నం వడ్డించారు. పెద్ద కుమారుడు యశ్వంత్ (7) తిన్నాడు. రాత్రి తొమ్మిదిన్నర సమయంలో ఇద్దరు కుమారులు, తల్లి కలసి రొయ్యల కూరతో అన్నం తిన్నారు. తర్వాత పిల్లలు ఆడుకున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో ఇద్దరు పిల్లలూ వాంతులు చేసుకున్నారు. తగ్గకపోవడంతో ఆస్పత్రికి తరలించారు. యశ్వంత్ పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. సీఐ జె.మురళి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, హెచ్‌సీ సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

డెక్కన్ రెమెడీస్‌లో కెమిస్ట్ మృతి



పోలినాయుడు (ఫైల్)

పరవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని డెక్కన్ రెమెడీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో విష వాయువు పీల్చడంతో కెమిస్ట్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు, పరవాడ సీఐఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం చినబొండపల్లికి చెందిన మరడాన పోలినాయుడు (41) డెక్కన్ రెమెడీస్‌లో సీనియర్ కెమిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల ఐదో తేదీన ఏ షిఫ్ట్‌కు హాజరయ్యాడు. ప్రొడక్షన్ బ్లాక్‌లోని మిథనాల్ స్వాలెంట్ (ఎంఈ) రియాక్టర్ ద్వారా ప్రాసెసింగ్ ప్రక్రియను పర్యవేక్షించాడు. మధ్యాహ్నం 1.40 గంటలకు అడ్మిన్ బ్లాక్‌కు వచ్చేశాడు. తరువాత కళ్లు తిరుగుతున్నాయని సహచరులకు చెప్పడంతో లంకెలపాలెంలోని షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. నాసిరకం మాస్క్ ధరించడంతో విషవాయువులు పీల్చి మృతిచెందాడని, యాజమాన్యం పీపీఈ కిట్‌ను సరఫరా చేయకపోవడమే కారణమంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, సీఐ మల్లికార్జునరావు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరు ఆదర్శనగర్‌కు చెందిన ముగిరాజు శ్రీరామ్(19) ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో తల్లి మంగమ్మ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ ఆదిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్డింగ్ పని చేసే శ్రీరామ్ ఈ నెల 5న ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కుటుంబంలో వివాదాల కారణంగా యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

వినాయక నిమజ్జనానికి వెళ్లిన వృద్ధుడి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి వెళ్లిన వృద్ధుడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంవీపీ పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6న రాత్రి ఎంవీపీ కాలనీ వాసవానిపాలెంకు చెందిన బద్ది రాములు (74) బయటకు వెళ్లారు. రాత్రి తిరిగి రాకపోవడంతో పలుచోట్ల వెతికినా జాడ తెలియలేదు. అతని భార్య బద్ది రాజులమ్మ ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి అతని కోసం గాలిస్తున్నారు.

46 డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం

మల్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జింక్ గేటు వద్ద ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ (గాజువాక శాఖ) సోమవారం నిర్వహించిన తనిఖీల్లో డిఫెన్స్ మద్యం పట్టుబడింది. శ్రీహరిపురం ఇందిరాకాలనీకి చెందిన శరగడం దుర్గాప్రసాద్ 46 డిఫెన్స్ మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నారు. తనిఖీలలో ఎస్ఐలు కె.నరసింహమూర్తి, ఇ.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఒరిగిపోయిన పాఠశాల బస్సు: ఇద్దరికి గాయాలు



పొల్లాల్లోకి ఒరిగిపోయిన పాఠశాల బస్సు, చికిత్స పొందుతున్న విద్యార్థిని

పద్మనాభం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాల బస్సు రోడ్డు పక్కగా ఒరిగిపోవడంతో ఇద్దరు విద్యార్థినులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పాండ్రంగి జంక్షన్ సమీపంలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాపురంలోని స్ప్రింగ్‌ఫీల్డు పాఠశాల బస్సులో భీమిలి మండలం తాటితూరు, కృష్ణంరాజుపేట తదితర గ్రామాల విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. బస్సు పాండ్రంగి జంక్షన్ వద్ద ఎదురుగా ఉన్న ఆటోను తప్పించే యత్నంలో రోడ్డు పక్కగా ఒరిగిపోయింది. ఈ ఘటనలో విద్యార్థులు ఒకరిపై ఒకరు పడిపోవడంతో తాటితూరుకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కనకల యశస్విని, కృష్ణంరాజుపేటకు చెందిన మూడో తరగతి విద్యార్థిని సరగడ సాహిత్య గాయపడ్డారు. వారిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందజేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపారు బస్సును వేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని, డ్రైవర్ ఎన్.పైడితల్లిని అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామన్నారు.